RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham   KARIMNAGAR   VOLUME:18   ISSUE:4   WEDNESDAY ,MAY 6,2026   PAGES:20   COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం   కరీంనగర్   సంపుటి :18   సంచిక :4   బుధవారం,   మే 6, 2026,   పేజీలు -20   వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## కాళేశ్వరం పై సిబిఐ విచారణ ఎందుకు చేయరు

తెలంగాణ పత్రిక ప్రతినిధి



కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో సమాధానం చెప్పాలని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని ఆ లోపు దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయం లో సీబీఐ దర్యాప్తుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే ఫీలింగే రావటం లేదని చెప్పారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. వేల కోట్ల - మిగతా 2లో

## బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు



తెలంగాణ పత్రిక ప్రతినిధి

బిఆర్ఎస్, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదన్నారు. మోడీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చేలోగా సిబిఐ విచారణకు ఆదేశించాల న్నారు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ. 21వేల కోట్లు చెల్లించామని - మిగతా 2లో

## బెంగాల్, అసోంలకు బిజెపి పరిశీలకుల నియామకం
## అమిత్ షా, జెపి నడ్డాలకు పార్టీ బాధ్యతలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి



పశ్చిమ బెంగాల్, అసోంలలో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో అక్కడ ప్రభుత్వాల ఏర్పాటుకు బిజెపి రంగం సిద్ధం చేసింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. బెంగాల్ సీఎం ఎవరూ అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి - మిగతా 2లో

## బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

తెలంగాణ పత్రిక ప్రతినిధి




బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ - మిగతా 2లో

## ప్రధాని పర్యటనలో భారీ భద్రత



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర - మిగతా 2లో

## శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక
## ప్రభుత్వం ఏర్పాటు పై సమావేశంలో చర్చ



తెలంగాణ పత్రిక ప్రతినిధి

తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. - మిగతా 2లో

## మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి



జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని ఈ విచారణలో పలు - మిగతా 2లో

## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం
## ప్రభుత్వాన్ని హెచ్చరించిన కెటిఆర్

తెలంగాణ పత్రిక ప్రతినిధి



రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. - మిగతా 2లో

## ఇచ్చిన హామీలకు..పాలనకు పొంతన లేదు
## గజ్వేల్ బిజెపి సభలో ఈటెల రాజేందర్ వ్యాఖ్య

తెలంగాణ పత్రిక ప్రతినిధి



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఆయన చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేదని ప్రజలు చెప్పుకొనే పరిస్థితి వచ్చిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఎన్ని శాపనార్థాలు పెట్టినా వేస్ట్ అని.. మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు ఓడిస్తే తప్ప మనకు మన:శాంతి లేదని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. - మిగతా 2లో

## బెంగాల్, అసోంలకు బిజెపి పరిశీలకుల నియామకం

- మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బీజేపీ అధిష్టానం నియమించింది . అలాగే, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీని సహ పరిశీలకుడిగా నియమించింది. అమిత్ షా, మోహన్ చరణ్ ఆధ్వర్యంలో బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, అగ్రనేతలు సమావేశమవుతారు. బెంగాల్ బీజేపీ లెజిస్లేటివ్ నేతను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకోవడం, కొత్త ప్రభుత్వ ఏర్పాటును షా, మోహన్ పర్యవేక్షిస్తారు. బెంగాల్‌లో ఈ నెల 9న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 207 సీట్లు గెలుచుకుంది. మరోవైపు అసోంకు సంబంధించి ప్రభుత్వ ఏర్పాటుకోసం కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర మంత్రి, బీజేపీ మాజీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ నియమించింది. నడ్డాతో పాటు సహపరిశీలకుడిగా హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైని వ్యవహరిస్తారు. వీరు ఇద్దరూ అసోంలో బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు, లెజిస్లేటివ్ పార్టీ లీడర్ ఎన్నికను పర్యవేక్షిస్తారు. అసోంలో బీజేపీ కూటమి 82 సీట్లు గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలిసారి అధికారం చేపట్టబోతుంది. దీంతో ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ఆసక్తి నెలకొంది. బీజేపీ అధిష్టానం ఎవరిని నియమిస్తుందో చూడాలి. ప్రస్తుతానికి సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అసోంలో ఇప్పటికే బీజేపీ నుంచి సీఎంగా ఉన్న హిమంత బిశ్వ శర్మ అదే పదవిలో కొనసాగుతారు.

## బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

- మొదటిపేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడం పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్,అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయ పడ్డారు.

## శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక

- మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటుకు కొన్ని సీట్లు తక్కువగా ఉన్న అంశాన్ని నేతలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ రాజకీయపరంగా ఆత్మ గౌరవం విషయంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. పొత్తు విషయం లోనూ తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు. అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతు కోసం తమ పార్టీ ఎవరినీ అడుక్కోబోదని తెలిపారు. ఇక, మెజారిటీ నిరూపించు కునేందుకు టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి 15 రోజుల సమయం కోరారు. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 108 సీట్లు సాధించి, అతిపెద్ద పార్టీగా మారింది. అధికారం చేపట్టాలంటే మరో 10 సీట్లు అవసరం. టీవీకేకు 35 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు కోసం టీవీకే ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగు తోంది. ఈ మేరకు కాంగ్రెస్‌తో రాయబారం నడుస్తోందని తెలుస్తోంది. విజయ్ తండ్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతు న్నారు. విజయ్ పార్టీ టీవీకే అధికారం చేపట్టాలంటే పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితి. విజయ్ ఎవరితో పొత్తువైపు మొగ్గు చూపుతారో తెలియాలి.

## బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

- మొదటిపేజీ తరువాయి

బిఆర్ఎస్, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదన్నారు. మోడీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చేలోగా సిబిఐ విచారణకు ఆదేశించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21వేల కోట్లు చెల్లించామని చెప్పారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరివేసిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ.. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'రైతులకు ఎకరానికి రూ.12వేల ఆర్థిక సాయంతోపాటు వ్యవసాయ పరికరాలు ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌కు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నాం. రైతును రాజు చేసే వరకు విశ్రమించబోము' అని పొంగులేటి అన్నారు.

# కాళేశ్వరం పై సిబిఐ విచారణ ఎందుకు చేయరు

-మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో సమాధానం చెప్పాలని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని.. ఆ లోపు దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయం లో సీబీఐ దర్యాప్తుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే ఫీలింగే రావటం లేదని చెప్పారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. వేల కోట్ల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. అలాగే రూ. వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ అవినీతిపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ పలుమార్లు ఆరోపణలు చేశారని.. అలాగే సీబీఐ విచారణను కోరారని గుర్తు చేశారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టి 8 నెలల క్రితం ఈ కేసును సీబీఐకు బదిలీ చేశామని పేర్కొన్నారు. బండి సంజయ్.. చేతిలోని తుపాకీ కాల్చకుండా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే లాభం ఏమిటి? అంటూ టీపీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నించారు. బండి సంజయ్ లోపాయికారీ ఒప్పందంలో ఉండి ఈ దర్యాప్తునకు అడ్డుపడు తున్నారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు లేకుండానే బీజేపీకి ఓట్లు పడ్డాయా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎంపీ సీట్లకి కృతజ్ఞతగా 8 నెలలుగా జరగాల్సిన సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ కేసు విచారణ ఆలస్యం ఎందుకు అవుతుందో కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలని టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. ల్గ÷తుల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ గతంలో అన్న మాటలు ప్రజలు మర్చిపోలేదన్నారు. రైతులు, పేద ప్రజలకు లాభం చేసిన ప్రభుత్వం తమదే అని చెప్పారు. ధాన్యం కొనుగోలు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. పంటల దిగుబడులు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా రైతులకి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలతో కాంగ్రెస్ ముందుకు పోతుందన్నారు. బెంగాల్‌లో బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవన్నారు. అక్కడ బీజేపీ గెలిచిందంటే.. అది ఓట్ల చోరీ వల్ల మాత్రమే అని టీపీసీసీ చీఫ్ కుండబద్దలు కొట్టారు. బెంగాల్‌లో ఓటు చోరీ జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి జరగొచ్చు అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కు కాపాడుకోవాలంటూ తెలంగాణ పౌరులకు ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. అయినా తెలంగాణలో అలాంటి ఆటలు సాగవు అని పేర్కొన్నారు. సర్ పేరిట ఓట్లు దొంగలించడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

# మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

- మొదటిపేజీ తరువాయి

జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని.. ఈ విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు. అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు. రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్మార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు. ఇక్కడి నుంచి బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలుపెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపోతే యువతులను బెదిరించి డబ్బులు కాజేసిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆజాద్ తల్లితోపాటు మేనమామను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన కార్లలో తిరుగుతున్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆజాద్.. స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. యువతులకు దగ్గరై.. ఫొటోలు బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఆజాద్, అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. మోసపోయిన వారిలో ఎక్కువ మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. యువతుల నుంచి కాజేసిన సొమ్మును తల్లి, మేనమామ ఖాతాల్లో జమచేసినట్లు విచారణలో తేలింది. దీంతో తాజాగా వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

# ప్రధాని పర్యటనలో భారీ భద్రత

- మొదటిపేజీ తరువాయి

ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏ వైన మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పోలీసు, ఉఊఓఅ, రోడ్లూ భవణాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ , నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి సజ్జనార్, రమేష్ , సుమతి, ్ఖ÷ర్ సర్వీసెస్ డీజీ, విక్రమ్ సింగ్ మన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలకు ..పాలనకు పొంతన లేదు

- మొదటిపేజీ తరువాయి

రిటైర్ ఉద్యోగులకు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద నగదు చెల్లించక పోవడంతో కోర్టు జోక్యం చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేసే పరిస్థితి వచ్చిందంటే.. ప్రభుత్వాన్ని ఎట్లా నడుపుతున్నారో వాళ్లకే తెలియాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లకు బిల్లులు అందక గతంలోనే కాదు.. నేడు కూడా వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఎంపీ ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీ కొట్టించుకునే పరిస్థితులు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం బాగుపడాలంటే ఏకైక మార్గం బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అరాచకం, దుర్మార్గాలు జరిగినా.. ఇది నా జాగీరు అని అహంకారంగా పాలించిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని ప్రజలు ఓడించారని ఎంపీ ఈటల తెలిపారు. తమిళనాడులో స్టాలిన్ మీద ఒక సామాన్యుడు గెలిచాడంటే డీఎంకే ప్రభుత్వంపై ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమైందన్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలని తాను కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. కుటుంబ రాజకీయాలు నడిపేవారు.. ఈ రాష్ట్రానికి తామే ఓనర్లమనే పద్ధతిలో అన్ని వాళ్లే చేసుకునే వారికి, లక్షల కోట్ల రూపాయలు స్కాంలు చేసి డబ్బులు సంపాదించి.. వాటితో ఎన్నికల్లో గెలవాలని కుట్ర చేసే వారికి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అత్యుత్తమ ఉదాహరణ అని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు.. చిన్న విషయం కాదన్నారు.

## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

- మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు.

# ఉపాధి కూలీలకు త్రాగునీరు టెంట్ హౌస్ అందిస్తాం





-గ్రామ సర్పంచులు వెల్లడి

పోతంగల్ తెలంగాణ పత్రిక మే 5.

పోతంగల్ మండలంలోని జల్లాపల్లి గ్రామ చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు స్థానిక గ్రామ సర్పంచులు వివేక్ దస్తగిరి లతరవి పనులను పరిశీలించారు. చెరువులో ఉపాధి కూలీలు పనిచేస్తున్న సమయంలో ఉపాధి కూలీలతో మాట్లాడి పలు సమస్యలను తెలుసుకున్నారు. పని చేసిన దినాలకు సకాలంలో డబ్బులు వస్తున్నాయా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. మే నెల కావడంతో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పలు జాగ్రత్తలు పాటించాలని ఉపాధి కూలీలకు పలు సూచనలను చేశారు .రోజు రోజుకు ఎండ తీవ్రత పెరగడంతో ఉపాధి హామీ కూలీలకు త్రాగటానికి మంచినీరు సౌకర్యం, ఎండ నుండి వడదెబ్బ తగలకుండా వారి రక్షణ కొరకు టెంటును ఏర్పాటు చేస్తామని ఉపాధి హామీ కూలీలకు భరోసా ఇచ్చారు. స్థానిక సర్పంచులు మంచినీటి సౌకర్యం టెంట్ హౌస్ ఏర్పాటును కల్పిస్తామని తెలపడంతో ఉపాధి కూలీలు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు బర్మావత్ వివేక్, షేక్ దస్తగిరి సంకు లతరవి ఉప సర్పంచ్ బీమా నాయక్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మహమ్మద్ ఖాన్ దేవా స్వామి ఫీల్డ్ అసిస్టెంట్ దేవిసింగ్ కేతావత్ సోంకుమార్ కిషన్ ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల పక్షపాతి గాంధీజీ ఫౌండేషన్





-ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం..

చండూర్ తెలంగాణ పత్రిక మే 5

చండూరు ప్రతినెల 30 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాస్ దంపతులు 2024వ సంవత్సరం జనవరి నెల ఒకటో తేదీన ప్రారంభించిన గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ" కార్యక్రమం మంగళవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు 29వ నెల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, అరుణ దంపతులు మాట్లాడుతూ మా జీవితం ఉన్నంతవరకు గాంధీజీ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీ తో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ, సమాజంలో ఆదర్శవంతంగా జీవిస్తామని, ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాక వారి ముఖంలో చిరునవ్వు చూడడమే గాంధీజీ ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. గాంధీజీ ఫౌండేషన్ పేదల పక్షపాతి అని, ప్రాణం ఉన్నంతవరకు నిరుపేదలకు సేవ చేస్తూనే ఉంటామని, పేదలకు సేవ చేయడంలో ఉన్న ఆనందం మరి ఎక్కడ లభించదని అన్నారు.మా గాంధీజీ విద్యాసంస్థల ద్వారా తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు చాలా తక్కువ ఫీజులతో విద్యనందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, గాంధీజీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ పులిపాటి రాధిక, చిలుకూరి రామేశ్వరి, బోడ యాదయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్,గోపి తదితరులు పాల్గొన్నారు.

# మే 6న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహణ

-సుమారు 68 సంస్థలలో 3439 ఉద్యోగ అవకాశాలు లభ్యం

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ప్రతినిధి మే-05 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం, టాస్క్ డి ఈ ఈ టీ సంయుక్తంగా మే 6న పెద్దపల్లి పట్టణంలోని పద్మ ఏ సీ కన్వెన్షన్ హాల్, ఆర్ టీ ఓ ఆఫీస్ ఎదురుగా, పెద్దపల్లిలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ డ్రైవ్‌లో సుమారు 20 లోకల్ సంస్థలు మరియు 48 నాన్ లోకల్ సంస్థలు మొత్తం 68 సంస్థలు పాల్గొంటుండగా, సుమారు 3439 ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. జీతం 18,000/- నుండి మొదలై 80,000/- వరకు ఉంటుందని తెలిపారు. టెలికాం ఒ కమ్యూనికేషన్, కస్టమర్ సపోర్ట్ ఒ బి పీ ఓ సేల్స్ ఒ మార్కెటింగ్, డిజిటల్ సర్వీసెస్, ఫీల్డ్ అసోసియేట్ వంటి వివిధ రంగాల్లో ఈ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.జిల్లాలోని యువతను పెద్ద సంఖ్యలో అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. టాస్క్ ఈ ఈ టీ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల ద్వారా యువత ఈ తరహా జాబ్ డ్రైవ్ ద్వారా ఉద్యోగాలు సాధించి మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ సీ ఇంటర్, ఐటి ఐ డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, యం బి ఏ తదితర అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. యువత ఈ మెగా జాబ్ డ్రైవ్‌ను ఒక మంచి అవకాశంగా తీసుకొని పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లతో పాటు ఆధార్, డి ఈ ఈ టీ పోర్టల్‌లో



నమోదు చేసుకుని హాజరు కావాలని తెలిపారు.జిల్లా యువత ఉపాధి పొందడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, జిల్లా సమగ్ర అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ మేరకు జిల్లా పరిధిలో యువతందరూ భారీగా పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## రైతు సంతోషంగా ఉంటేనే అందరూ సంతోషంగా ఉంటారు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

-సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి

తెలంగాణ పత్రిక, సూర్యాపేట ,మే 5

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉద్యాన పంటల సాగు -- ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదలపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు మరియు మహిళలకు సంబంధించిన పథకాలు గ్రామ స్థాయిలో ప్రతి రైతుకూ చేరేలా చేయడం అధికారుల ముఖ్య బాధ్యత అని తెలిపారు. రైతులకు అత్యంత దగ్గరగా ఉండే అగ్రికల్చర్ మరియు హార్టికల్చర్ శాఖలు ఎప్పటికప్పుడు రైతులతో కలిసి పనిచేస్తూ, సరైన మార్గదర్శనం అందించాలని సూచించారు.రైతులు ఏ కాలంలో ఏ పంట వేయాలి, ఏ పంటలకు మంచి దిగుబడి వస్తుందనే విషయాలను ముందుగానే తెలియజేయాలని, భూమి పరీక్షలు (Soil Testing) నిర్వహించి ఆ భూమికి అనుకూలమైన పంటలను సూచించడం అవసరమని పేర్కొన్నారు. ఎప్పటికీ ఒకే




పంటపై ఆధారపడకుండా, లాభదాయకమైన పంటల వైపు దృష్టి మళ్లించాలని, ముఖ్యంగా ఆయిల్ పామ్, పప్పుదినుసులు మరియు ఇతర వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతు సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రైతు సంతోషంగా ఉంటేనే సమాజం మొత్తం సంతోషంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



పెద్దపల్లి, ప్రతినిధి మే 5 ( తెలంగాణ పత్రిక )

ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఒక కోటి 35 లక్షల రూపాయలను మంజూరు చేసిందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు.?ఈ నిధులతో ఆలయ ఆవరణలో కోటి రూపాయలతో సి.సి. రోడ్లు, 15 లక్షలతో టాయిలెట్స్, మరో 20 లక్షలతో అధునాతన లైటింగ్ పనులు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. .ఓదెల ఆలయ విశిష్టతను గుర్తించి, ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే కోరగా.. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. పాలకమండలి సభ్యులు దాతల సహకారంతో రూములు మంజూరు చేయించారని త్వరలోనే పనులు కూడా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన విజయ రమణారావును దేవాలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, ఈవో సదయ్య ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు శివపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ఘనంగా సన్మానించారు.

## నివాళులర్పించిన కాకులమర్రి దంపతులు



మంగపేట, మే05(తెలంగాణ పత్రిక)

హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న పల్లెపాటి దేవేందర్ రావు దశదినకర్మ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత హాజరై నివాళులర్పించారు.లక్ష్మణ్ బాబు తమ్ముడు కాకులమర్రి ప్రవీణ్ రావు మామగారైన దేవేందర్ రావు మృతి పట్ల వారు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. దేవేందర్ రావు కుమారుడు పల్లెపాటి సంతోష్‌ను ఓదార్చి, ఆ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ కీలక నాయకులు తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్ రావు, ఎండి వలీ బాబా, చిట్టి మల్ల సమ్మయ్య, యలవర్తి శ్రీనివాసరావు, తాహెర్ బాబా, ఏజాస్ అక్బర్ తదితరులు పాల్గొని మృతుడికి ఘనంగా నివాళులర్పించారు.

## మహాత్మా జ్యోతిబా పూలే బి.సి. వెల్ఫేర్ గురుకులాల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

-జిల్లా కో-ఆర్డినేటర్ మణి దీప్తి

పెద్దపల్లి,ప్రతినిధి మే- 05 ( తెలంగాణ పత్రిక

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (MJPTBCWREI) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని గురుకులాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ మని దీప్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి ప్రవేశ పరీక్ష ఉండదు. విద్యార్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల (జి పి ఏ ) ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని,బాలురకు సుల్తానాబాద్, కాటారం, రామగుండం మొత్తం 240 సీట్లు, బాలికలకు పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్, గుంజపడుగు మొత్తం 320 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు మే12 లో దరఖాస్తు చేసుకోవాలి.అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా కింది ఇచ్చిన వెబ్‌సైట్లలో సమర్పించవచ్చు. https://mjptbcwreis.telangana.gov.in
ttps://mjptbcadmissions.org/MJP-inter ఇప్పటికే బి.సి. గురుకుల పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు విడిగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. వారి దరఖాస్తులు నేరుగా సంబంధిత పాఠశాలల నుండే పంపించబడతాయని, జిల్లాలోని అర్హులైన విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్ మని దీప్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

-జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్

పెద్దపల్లి, ప్రతినిధి మే 05 ( తెలంగాణ పత్రిక )



పెద్దపల్లి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 2 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (పీడియాట్రీషియన్ ,3 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎం.బి.బి.ఎస్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని,సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు వేతనం,సివిల్ అసిస్టెంట్ సర్జన్ కి వేతనం రూపాయలు 52,351 ఉంటుందని ,ఇతర వివరాలకు 9492457809 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ప్రచార ప్రభావం ఫలితాల్లో స్పష్టమైన ప్రతిఫలం

-ఈ విజయం కాంగ్రెస్ శ్రేణుల్లో ఎనర్జీ బూస్ట్

-మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 05



కేరళలో యూడీఎఫ్ కూటమి సాధించిన ఘన విజయం ప్రజా తీర్పుకు స్పష్టమైన నిదర్శనమని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రచారానికి లభించిన అపార ఆదరణ ఈ ఫలితాల్లో ప్రతిఫలించిందని, ఈ విజయం చారిత్రాత్మక మలుపు అని అడువాలజ్యోతి లక్ష్మణ్ అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, నాయకత్వంపై ప్రజలు మరోసారి నమ్మకం వ్యక్తం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీపై, దాని నాయకత్వంపై ఉంచిన నమ్మకం ఈ ఫలితాల ద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారానికి లభించిన అపార ఆదరణ ఈ విజయానికి ప్రధాన కారణమని, ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలను అర్థం చేసుకుని ముందుకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ విధానం ఫలితాన్ని అందించిందని ఆమె అన్నారు. ఈ విజయాన్ని చారిత్రాత్మక మలుపుగా అభివర్ణిస్తూ, యూడీఎఫ్ కూటమి నాయకత్వం సమన్వయంతో, కృషితో సాధించిన ఫలితమని కొనియాడారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనానికి ఇది ఒక కీలక సూచికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.అలాగే, ఈ గెలుపు తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపుతుందని, రాబోయే ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

-పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్.



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 5

జగిత్యాల పట్టణ పొన్నాల గార్డెన్స్ లో జగిత్యాల.పట్టణానికి చెందిన 55 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 17లక్షల 4వేల 500 రూపాయల విలువగల చెక్కులను,180 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ పథకం లో భాగంగా మంజూరైన 2 కోట్ల 10 లక్షల రూపాయలు విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్య ప్రణవ్, ఎమ్మార్వో రామ్మోహన్,ఏఎంసి ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం, పిసిసి సెక్రటరీ బండ శంకర్,కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ నాయకులు, మున్సిపల్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంట మార్పిడి, లాభదాయక పంటలపై దృష్టి సారించాలి







-ఆయిల్ పామ్ సాగును విస్తరించాలి -- రైతులకు భారీ సబ్సిడీలు

-వరి సాగు పెరుగుదల ఆందోళనకరం -- ప్రత్యామ్నాయ పంటలే మార్గం

-ఎలిగేడు మండలంలో నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ చింతకుంట విజయరామణరావు

పెద్దపల్లి, ప్రతినిధి మే5 ( తెలంగాణ పత్రిక )

రైతులు పంట మార్పిడి చేసి లాభదాయక పంటలపై దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరామణరావు సూచించారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎలిగేడు మండలంలో మంగళవారం నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రామణరావు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసిపాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయరామణరావు మాట్లాడుతూ తన చిన్ననాటి రోజుల్లో ఎలిగేడు మండలంలో కాలువ నీరు అందుబాటులో లేకపోయేదని గుర్తుచేశారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ నాయకత్వంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగి కాలువల ద్వారా రైతులకు నీరు అందించ బడిందన్నారు. మొదటి దశలో అప్పటి కరీంనగర్ జిల్లాలో 5.4 లక్షల ఎకరాలకు నీరు అందించగా, అందులో 1.4 లక్షల ఎకరాలు పెద్దపల్లిలోనే ఉన్నాయని తెలిపారు.2014 తర్వాత శ్రీరాంసాగర్ కాలువలను నిర్లక్ష్యం చేసి ఇతర ప్రాజెక్టులపై దృష్టి సారించడం వల్ల ఈ ప్రాంత రైతులకు నష్టం జరిగిందని విమర్శించారు. గతంలో పెసర్లు, జొన్నలు, కందులు వంటి పంటలు పండించిన రైతులు ఇప్పుడు ఎక్కువగా వరి పంటపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఇది రైతులకు లాభదాయకం కాదని, పంట మార్పిడి చేపట్టి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు.రైతులు ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలను సాగు చేయాలని, భూమి సారాన్ని కాపాడేందుకు యూరియా వినియోగాన్ని తగ్గించాలని, పంట అవశేషాలను కాల్చడం మానుకోవాలనిసూచించారు. మన నియోజకవర్గంలో కొంతమంది రైతులు ఎకరానికి రూ.1 లక్ష నుండి రూ.1.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. వచ్చే ఏడాది ఎలిగేడు మండలంలో కనీసం వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ

ప్రభుత్వం రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో అంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, మొదటి నాలుగేళ్లపాటు ఎకరానికి సుమారు రూ.52 వేల వరకు సబ్సిడీ అందిస్తున్నామని పేర్కొన్నారు. అంతర్ పంటలు పూర్తి మద్దతు ఉంటుందని, ఐదేళ్ల క్రితం రూ.14 వేలుగా ఉన్న ఆయిల్ పామ్ ధర ప్రస్తుతం రూ.23 వేల వరకు పెరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ధరలు పెరుగుతాయని, దేశంలో నూనెలకు దిగుమతులపై ఆధారపడుతున్నందున ఆయిల్ పామ్‌కు మంచి మార్కెట్ ఉందన్నారు. శ్రీరాంపూర్ ప్రాంతంలో కొత్త ఫ్యాక్టరీ రాబోతుండడంతో మార్కెటింగ్ సమస్యలు ఉండవని తెలిపారు.పెద్దపల్లి జిల్లా రైతులు సంపన్న రైతులుగా పేరొందినందున ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు. అదే విధంగా వరి సాగు రోజురోజుకీ పెరుగుతున్నదని, నాలుగేళ్లతో పోలిస్తే ప్రస్తుతం రోజుకు ఏడు రెట్లు ఎక్కువ వరి కొనుగోలు చేస్తున్నప్పటికీ ఇంకా అధికంగా మార్కెట్‌కు వస్తున్నదని తెలిపారు. అధిక ఉత్పత్తి రైతులకు లాభదాయకం కాదని హెచ్చరించారు. వడగండ్ల వానలు పెరుగుతున్న నేపథ్యంలో పంట నష్టాలను తగ్గించేందుకు రబీ సీజన్‌ను 7 నుంచి 10 రోజులు ముందుకు మార్చేలా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ యాకన్న ,ప్రజాప్రతినిధులు, రైతులు , తదితరులు,పాల్గొన్నారు.

# ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు





-పంట కొనుగోళ్లు, నిల్వలు, రవాణాపై సమగ్ర సమీక్ష

-వేడిగాలుల నేపథ్యంలో కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలి

-ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ప్రతినిధి మే 05 ( తెలంగాణ పత్రిక )

ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ ఐకేపీ , మంథనిలోని గంగపురి ఐకెపి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షపరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా కేంద్రానికి వచ్చిన పంట పరిమాణం, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,తేమ ఉన్న పంటను వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రంలో అవసరమైన తార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని, గన్నీ బ్యాగుల సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వేడిగాలుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రవాణా వాహనాలు, హమాలీల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యాకన్న, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఏ డి ఏ అంజని, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కోటగిరిలో బిజెపి పార్టీ శ్రేణులు సంబరాలు





-మండల అధ్యక్షుడు వేముల నవీన్ ఆధ్వర్యంలో

కోటగిరి తెలంగాణ పత్రిక మే 5.

పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి లో ఎన్నికల్లో బిజెపి పార్టీ సాధించిన అఖండ విజయానికి కోటగిరి మండల కేంద్రంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఏముల నవీన్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొని హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. బాణా సంచాలను కాల్చి మండల నాయకులు కార్యకర్తలు సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ బిజెపి నాయకులు కోనేరు శశాంక్ ముఖ్య అతిథిగా పాల్గొనీ కార్యకర్తలకు,ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు.బాణ సంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.కోనేరు శశాంక్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో దిది దరిద్రమైన పాలన కు బై బై చెప్పి ప్రజలు స్వస్తి పలికారని కేంద్రంలో అద్భుతమైన పరిపాలన చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షాలపై నమ్మకంతో బిజెపికి అమోఘమైన విజయాన్ని అందించారన్నారు.

రాబోయేది తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వమని అన్నారు. ఈనెల 10న హైదరాబాదులో భారీ సభకు ప్రధాని నరేంద్ర మోడీ రానున్నట్లు తెలిపారు. బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షుడు ఏముల నవీన్ మాట్లాడుతూ. పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీ అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అక్కడి ప్రజలపై బిజెపి కార్యకర్తలపై జరుగుతున్న దాడులను చూసి ప్రజలు మమత బెనర్జీకి ఓటుతో బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సొంత రాష్ట్రంలో బిజెపి జెండా ఎగరటం దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు.అస్సాం లో హిమంత బిశ్వ శర్మ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ మూడవసారి విజయ దుందుభి మోగించిందని హర్షం వ్యక్తం చేశారు. అస్సాం,పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ లో బిజెపికి విజయం అందించిన ప్రతి ఒక్క కార్యకర్తకు ఓటర్లకు కోటగిరి మండలం బిజెపి పార్టీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో సైతం బిజెపి పార్టీ జెండాను ఎగరవేసేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉన్నామన్నారు. నరేంద్ర మోడీ అమిత్ షాలు తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి సారించి భారతీయ జనతా పార్టీ జెండాను ఎగరవేయాలనికోరారు.ఈకార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్,మండల అధ్యక్షులు ఏముల నవీన్ సీనియర్ నాయకులు మోహన్ రావు హాగీర్ రావు దేశాయ్ సాయి కుమార్ గౌడ్,వడ్ల శ్యామ్ బోనిగే శ్యామ్ కోయిగుర్ సాయిలు , మామిడి శ్రీనివాస్ ,నాగరాజు, మామిడి సాయిలు గుంజరి జగదీష్, ఆలపాటి హరి కృష్ణ సోషల్ మీడియా ఇంచార్జి దుబాస్ మహేష్ కార్యకర్తలు కర్నె రాజు నరేష్,ప్రశాంత్,సంఘని వినోద్ ,మదరి శివ ,రుద్ర గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి









-రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి.
-రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.
-చర్ల పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే,5

చర్ల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.సత్యనారాయణపురం గ్రామంలోని పెద్దపల్లి--ముమ్మిడివరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం పరిమాణం, కొనుగోలు ప్రక్రియ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలిస్తూ టార్పాలిన్లు, హమాలీలు, తాగునీరు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాన్ని తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయడానికి తగినన్ని లారీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం నష్టపోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ట్యాబ్ ఎంట్రీలను ఆలస్యం లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం సత్యనారాయణపురం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. కాకర్లపూడి విజయలక్ష్మి పూర్తి చేసిన ఇల్లు, చినిగిరి రాజు రూఫ్ స్థాయిలో ఉన్న ఇల్లు, కారం నాగరాజు స్లాబ్ దశలో ఉన్న ఇల్లు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పునాది నుంచి స్లాబ్ వరకు ప్రతి దశలో ఇంజనీరింగ్ ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతపై సమీక్ష నిర్వహిస్తూ లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సిమెంట్, ఇసుక, ఇనుము వంటి నిర్మాణ సామగ్రి నాణ్యంగా ఉండేలా చూడాలని, పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామంలో మంజూరైన 27 ఇళ్లలో 25 ఇళ్లు వివిధ దశల్లో కొనసాగుతుండగా, మిగిలిన ఇళ్లకు గ్రౌండింగ్ వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు నాణ్యమైన గృహ వసతి కల్పించడమే లక్ష్యమని, పనులు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు మౌలిక సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. మేటర్నిటీ వార్డు, దయాలసిస్ కేంద్రం, మందుల నిల్వ గది, వంటగది, అవుట్ పేషెంట్ విభాగం తదితర విభాగాలను సందర్శించి సేవల నాణ్యతను తనిఖీ చేశారు.ఓపీ విభాగంలో చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మందుల నిల్వలను పరిశీలించి అవసరమైన ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా స్టాక్ నిర్వహణను క్రమబద్ధీకరించాలని సూచించారు. రోగులకు అందించే ఆహారం నాణ్యతపై దృష్టి సారిస్తూ శుభ్రతతో కూడిన పోషకాహారం అందించాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో 108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి అత్యవసర సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకుని, సమయానికి స్పందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రిలో త్రాగునీటి కొరత ఉన్నట్లు గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి నిరంతర నీటి సరఫరా కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, శుభ్రత, మౌలిక సదుపాయాలు అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, గృహ నిర్మాణ శాఖ ఏ ఈ ముకేశ్ ,ఏ ఓ లావణ్య, మిషన్ భగీరథ ఏఈ లు అరుణ్,రాము, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపర్డెంట్ డాక్టర్ సాయి వర్ధన్, డాక్టర్లు రాంప్రసాద్, రవికుమార్, తిరుపతిరావు, జాన్ ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నవ లిమిటెడ్, వారి సహకారం తో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్, వాక్సిన్ రూమ్ ప్రారంభోత్సవం







భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 5

నవ లిమిటెడ్ పాల్వంచ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీస్ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన వాక్సిన్ రూమ్, అర్బన్ హెల్త్ సెంటర్, శేఖర్ బంజర నందు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ముఖ్య అతిధిగా విచ్చేసి నేడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ శేఖరబంజర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ కుమారి మాట్లాడుతూ వాక్సిన్ సమయంలో రోగులు ఎదురుకుంటున్న సమస్యలను నవలిమిటెడ్ మేనేజ్మెంట్ దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించి మూడు నెలలలోనే వాక్సిన్ రూమ్ ను నిర్మాణం చేసి నేడు అప్పగించడం జరిగిందని తెలిపారు.ముఖ్య అతిథి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల కొరకు నిరీక్షణాలయం నిర్మించడం కోవిడ్ సమయంలో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ ను ఏర్పాటు చేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి నవ లిమిటెడ్ చేస్తున్న కృషిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డి.జి.ఎమ్ సి.హెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ నవలిమిటెడ్ చేస్తున్న ఆరోగ్యం, విద్య, జీవనోపాదుల కార్యక్రమలను వివరించారు.ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఆర్ మేనేజర్ సి.హెచ్. శ్రీనివాసరావు, సివిల్ ఇంజనీర్ ఫణింధ్రచారి, కరుణాకర్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, సి.ఎస్. ఆర్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డైరెక్టర్ (పిడపీ) సమక్షంలో ఏరియాలో సమీక్ష సమావేశం





భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 5

ఈ సమావేశంలో వివిధ ప్రాజెక్టుల పురోగతి, ఉత్పత్తి లక్ష్యాలు, భద్రతా ప్రమాణాలు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, నాణ్యత ప్రమాణాలను పాటించడం, భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. డైరెక్టర్ (పిడపీ) కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రతి విభాగం సమన్వయంతో పని చేస్తే సంస్థ లక్ష్యాలను సమయానికి సాధించవచ్చని పేర్కొన్నారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఏరియా జీఎం శాలెం రాజు ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను వివరించి, ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. సంబంధిత అధికారులకు పనులను వేగవంతం చేయాలని, సమయపాలన పాటించాలని సూచించారు. అదేవిధంగా, పర్యావరణ పరిరక్షణ చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (పిడపీ) కె. వెంకటేశ్వర్లు ఏరియా జీఎం శాలెం రాజు ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వి. నరసింహా రావు ,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ముక్కిపాటి వెంకటేశ్వర్లు పీవీకే ఏజెంట్ రామ్ భరోస్ మెహతో ఏరియా ఇంజనీర్ కె. సూర్యనారాయణ రాజు, ఏజీఎం (సివిల్) రామకృష్ణ ఇతర విభాగాల అదికారులు పాల్గొన్నారు.

# రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

-వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలి
-శాస్త్రవేత్తలు మహాదేవప్ప, పుష్ప వల్లి




వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 05 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తి మండలంలోని హస్తాల్పూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం రైతుల్లో చైతన్యం నింపింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహాదేవప్ప,పుష్పవల్లి వర్షాకాల పంటల సాగుపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. అధిక ఎరువుల వినియోగం వల్ల నష్టాలు ఎదురయ్యే అవకాశం ఉందని, సంప్రదాయ పద్ధతులను అనుసరించి పంటలు సాగు చేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చని వివరించారు. అలాగే ఆరోగ్యవంతమైన ఆహారం ఉత్పత్తి చేయాలంటే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు కొత్త పద్ధతులపై ఆసక్తి కనబరిచారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నర్సింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఝాన్సీతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఈఎంఆర్ఎస్ లో 11 వ తరగతిలో దరఖాస్తులకు ఆహ్వానం

-ఎస్టీ విద్యార్థిని విద్యార్థులు మాత్రమే అర్హులు...



కొత్తగూడెం మే 5 (తెలంగాణ పత్రిక)

భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని రామవరం లో గల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఈఎంఆర్ఎస్ నందు , ఈ విద్య సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణత చెందిన బాల బాలికలు,పదకొండవ తరగతి సీబీఎస్ఈ లో చదువుకొనుటకు, ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది . విద్యార్థులు ఎంచుకోవాల్సిన కోర్సులు, ఎంపీసీ, బైపిసి, సిఇసి ,పలు గ్రూపులలో ఆసక్తి కళా విద్యార్థిని విద్యార్థులు, ఎస్టీ విద్యార్థిని విద్యార్థులు మాత్రమే అర్హులని తెలియజేస్తూ ,ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తులను ఈ ఎం ఆర్ ఎస్ రామవరం పంజాబ్ గడ్డ నందు దరఖాస్తు చేసుకోవాలి. ఆసక్తి గల విద్యార్థిని విద్యార్థులు, ఈ.ఎం.ఆర్.ఎస్ రామవరం నందు దరఖాస్తు ఫారం ను పొంది ,పూర్తి చేసిన దరఖాస్తు ఫారం ను ఈనెల 15వ తేదీ లోపు సమర్పించాల్సి ఉంటుంది .పూర్తి వివరాలకు ఈ.ఎం.ఆర్.ఎస్ ప్రిన్సిపల్ (8277020057) ఫోన్ నెంబర్ను సంప్రదించవచ్చు.

# హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ఏక్తయాత్ర విజయవంతం చేయాలని పిలుపు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 05, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్లో నిర్వహించబడుతున్న హిందూ ఏక్తయాత్రకు అన్ని పార్టీలకు అతీతంగా హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు, నాయకులు పిలుపునిచ్చారు. సమాజ ఐక్యతను బలపరిచే ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆవుల లక్ష్మణ్ రెడ్డి , ఆవుల లక్ష్మణ్,కొండం శ్రీనివాస్ రెడ్డి, ఎర్ర బాల్ రెడ్డి, అనుముల నర్సయ్య, కడుదుల నాగరాజు, పాలోజు రాజేంద్ర ప్రసాద్, అనుముల మల్లయ్య, కుస మహేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే ధర్మ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం



**ఆత్మకూరు, మే 05, (తెలంగాణ పత్రిక):**
హన్మకొండలో బుధవారం నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సుకు విచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారకరామారావు కు పరకాల నియోజకవర్గ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హన్మకొండకు చేరుకుంటున్న కేటీఆర్ ను రాంపూర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల సమన్వయ కమిటీ సభ్యులు, స్థానిక పార్టీ శ్రేణులు కలిసి ఆహ్వానించారు. నాయకులు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ రైతు సంగ్రామ సదస్సును నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై కేటీఆర్ స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారని అన్నారు. ఈ సదస్సు ద్వారా రైతులకు న్యాయం చేయాలని పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు పోరాటం చేస్తుందని, రేపటి సదస్సు రైతులకు నూతన ఆశలను నింపుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున రైతులు, కార్యకర్తలు హన్మకొండకు తరలి వచ్చి సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలానికి చెందిన నాయకులు, లేతకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, సావూరే రాజేశ్వరరావు, కాంతాల కేశవరెడ్డి, బొల్లెబోయిన రవి యాదవ్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనం అధిక దిగుబడి,రైతుకు అధిక లాభం



**తెలంగాణ పత్రిక చారకొండ :మే 5**
నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలం చంద్రాయన్ పల్లి గ్రామంలో నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చు అని జినేక్స్ సీడ్ కంపెనీ ప్రతినిధి సంధ రాములు పేర్కొన్నారు. మంగళవారం చంద్రాయినపల్లి గ్రామంలోని రైతు బాధగోని వెంకటయ్య హైబ్రిడ్ అల్ట్రా రకం పంటను సాగు చేశారు,తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడి ఇస్తుందని రాములు తెలిపారు ఎకరానికి 45 నుంచి 50 క్వింటాలు దిగుబడి వస్తుంది అని అన్నారు. అనంతరం రైతులకు సలహాలు సూచనలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో రైతు సేవకేంద్రం డీలర్ ఎర్ర రామకృష్ణ,చుట్టు పక్కల గ్రామాల రైతులు 250మందిపాల్గొన్నారు.


## శ్రీ చైతన్య విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే పాయం



**తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, మే 5.**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలంలోని శ్రీ చైతన్య స్కూల్ నందు పదో తరగతి చదివిన విద్యార్థులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన ఎ. గేయశ్రీ (578),పూల కుమారి (575),వాణి అక్షయ(575),సహస్ర (570) విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించడమే కాకుండా పాఠశాల సిబ్బందిని, ఉపాధ్యాయులను మెచ్చుకున్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శాలువాలుతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తోటి విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షాహిన్, వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్, సి ఇన్‌చార్జ్ కొమరయ్య, 10వ తరగతి ఇన్‌చార్జ్ నరేష్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గోసపై గూడెప్పాడ్‌లో ధర్నా





**- ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శలు**

**ఆత్మకూర్ మే 05, (తెలంగాణ పత్రిక):**
ఆత్మకూరు మండలం గూడెప్పాడు మార్కెట్‌ను మంగళవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవినీతి, ఆలస్యం, సౌకర్యాల లేమి వంటి సమస్యలను రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రైతులు మాట్లాడుతూ 20 రోజులు గడిచినా కాంటాలు పెట్టడం లేదని, ప్రతి పనికీ డబ్బులు అడుగుతున్నారని, మార్కెట్‌లో తాగునీరు కూడా అందుబాటులో లేదని వాపోయారు. అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితులపై ఆగ్రహంతో గూడెప్పాడ్ క్రాస్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ మక్కల కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గన్నీ బ్యాగులు ఇవ్వకపోవడం, కాంటాలైన ధాన్యాన్ని తరలించకపోవడం ద్వారా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు బహిరంగంగా చెబుతున్నారని తెలిపారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని, రుణమాఫీ మరియు రైతు భరోసా వంటి అంశాల్లో నిర్లక్ష్యం చూపిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మక్కల కొనుగోలు నిలిచిపోయిందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మే 6న బుధవారం హనుమకొండలో జరిగే రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి ,మాజీ రాష్ట్ర ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు గండు రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, కాంతాల కేశవరెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోన్ అధ్యక్షులు కమల రాజేశ్వరరావు, రవి యాదవ్, కామారం సర్పంచ్ తోటలత కుమారస్వామి,రైతులు, రేవూరి సంపత్ రెడ్డి , బీరం రజనీకర్ రెడ్డి, వేణు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం





**-జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్**

**గూడూరు మండల ప్రతినిధి మే 05. (తెలంగాణ పత్రిక)**
మహబూబాబాద్ జిల్లా, బాల్యం లో వివాహం అనర్థాలకు మూలం అని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ అన్నారు. మంగళ వారం రోజున గూడూరు మండల కేంద్రం పరిధిలోని అయోధ్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా డే కార్యక్రమానికి ముఖ్య అతిదిగా ఆయన పాల్గొన్నారు. తధానంతరం కొప్పు ప్రసాద్ మాట్లాడుతూ.. భారతదేశంలో వివాహానికి సరైన వయసు అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తి అవ్వాలని, బాల్యవివాహాల ను నివారించడానికి లింగ సమానతను ప్రోత్సహించడానికి వీలుగా ఉంటుందని, సరైన వయసు లో వివాహం కావడం వలన అనేక లాభాలు ఉన్నాయని, ముఖ్యంగా చిన్నపిల్లల వివాహాలను నిషేధించడం ద్వారా, చట్టం ద్వారా మౌలిక హక్కులను గుర్తిస్తుందని, బాల్య వివాహాల వల్ల వచ్చే శారీరక, భావోద్వేగ, మానసిక ఒత్తిడిలను నివారిస్తుందని ఆయన తెలిపారు. అంతేకాకుండా వివాహ వయసును ఆలస్యం చేయడం వలన అమ్మాయి శారీరక ధ్రుడత్వం పెరిగి సరైన వయస్సులో గర్భదారణ పొందవచ్చని, తన విద్యను కొనసాగించడానికి, వ్యక్తిగత వృత్తిపరమైన అభివృద్ధికి కొంత మౌలిక నైపుణ్యాలను పొందడానికి అవకాశం ఇస్తుందని, ఇది వారిని శక్తివంతులుగా మార్చుతుందని అది సమాజానికి తోడ్పడుతుందని, బాల్య వివాహాలు అమ్మాయిలకు ప్రతికూల ఆరోగ్యాన్ని కలిగిస్తాయని, మాతృ మరణ రేట్లు పెరగడం, బాల్య గర్భధారణలను తగ్గించడం ద్వారా, మెరుగైన ఆరోగ్య ఫలితాలను ప్రోత్సహిస్తుందని సరైన వయసులో పెళ్లి చేసుకుంటే, అమ్మాయి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని, సంబంధాలను అర్థం చేసుకుని బాధ్యతగా ముందుకు సాగుతుందని, జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో జీవిత నిర్ణయాలలో స్పష్టత ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితంలో సంపూర్ణంగా పాల్గొనడానికి వీలు కల్పించడం ద్వారా సాధికారతను కల్పిస్తుందని, ఇది వారికి జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి, ఉన్నత విద్యను అభ్యసించడానికి తోడ్పడుతుందని, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోదకుడు పురుషోత్తమ్, ఎంపిహెచ్ ఈఓలు, కేఎల్ఎన్. స్వామి, వాంకుడోత్ గోపిచంద్, పిహెచ్ఎన్ మేరి, సుపెర్వైజర్స్ ఫహీముద్దీన్, గణేశ్, హేమలత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన షబ్బీర్ అలీ

**కామారెడ్డి, మే 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**
కామారెడ్డి పట్టణంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా, షబ్బీర్ అలీ నివాసం వద్ద ఉన్న చౌక ధరల దుకాణంలో “ఇంద్రమ్మ చీరల పంపిణీ కార్యక్రమం” ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ లబ్ధిదారులకు స్వయంగా చీరలు అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది. ప్రతి కుటుంబానికి అండగా నిలబడి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం మా ప్రభుత్వ ధ్యేయం. ఇంద్రమ్మ చీరల వంటి పథకాలు కేవలం వస్త్రాలు ఇవ్వడం మాత్రమే కాదు, ప్రతి మహిళకు గౌరవాన్ని అందించడమే లక్ష్యం, అని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల గురించి ప్రస్తావిస్తూ, ఇంద్రమ్మ ఇండ్లు, 2బిహెచ్‌కే గృహాలు, పెన్షన్ పథకాలు, రైతులకు మద్దతు -- ఇలా ప్రతి వర్గానికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వం పనిచేస్తోంది. కామారెడ్డి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తాంఅని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సందీప్, మాజీ పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు, కౌన్సిలర్లు షేరు, అన్వార్, వాజీద్, సిద్దిక్, గంప ప్రసాద్ తదితరులతో పాటు ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్ సహా పలువురు అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పథకం పనుల మెరుగుదలకు కార్యాచరణ : ఎంపీడీవో సంకీర్త్





**-ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే వారి శాతం పెంచాలి.**

తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, మే 5.

పినపాక మండలంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఎంపీడీవో సంకీర్త్ సూచించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ సెక్రటరీలతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారీగా పనుల్లో పాల్గొనేవారి హాజరు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలు, పనుల ప్రగతి, కార్మికులకు చెల్లింపులు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి, అర్హులైన కార్మికులను ఎక్కువగా భాగస్వామ్యం చేయాలని ఎంపీడీవో సూచించారు. గ్రామ స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ఈ సమావేశానికి డీఎల్పీఓ సుధీర్ కుమార్, ప్రత్యేక అధికారి తాతారావు హాజరై పథకం అమలుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశం ద్వారా ఉపాధి హామీ పనుల మెరుగుదలకు కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీవో వీరభద్ర స్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు వేగవంతం చేయాలి- జిల్లా కలెక్టర్





మిర్యాలగూడ ప్రతినిధి// మే 5:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ పట్టణం గుమస్తాల కాలనీ చేపట్టిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన గుమ్మస్తాల కాలనీలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కాలనీకి వచ్చే ప్రధాన రోడ్లకు ఇరువైపుల చెత్తచెదారం చెట్లను తొలగింపు తో పాటు రోడ్లను డోజర్ తో గుంతలు పూడ్చిలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కాలనీలోని డ్రైనేజీలు త్రీ ఫేస్ పవర్ ప్రతి ఇంటికి ఎర్తింగ్ కరెంటు మీటర్లు ఏర్పాటు చేసేలా చూడాలని ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి ని ఆదేశించారు. ప్రతి ఇంటిపై వాటర్ ట్యాంకులో నీటిని ఎక్కించి నీటి సరఫరాను పరిశీలించాలని, అలాగే ప్రతి ఇంట్లో వైరింగ్ తో పాటు ఎక్కడ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అన్ని పనులు వేగంగా పూర్తి చేసి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు బుధవారం లోగా వాటర్ ట్యాంకులను నీటితో నింపి, ప్రతి ఇంటికి నీటి సరఫరా తనిఖీ చేయడం పూర్తి చేయాలన్నారు.

# ఉప్పల శ్రీనివాస్ గుప్త జన్మదినం సందర్భంగా స్టీల్ వాటర్ ట్యాంక్ పంపిణీ

**-ఎన్ జి ఓ కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అందజేత**

కామారెడ్డి, మే 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షులు,సమాజ సేవకులు, తెలంగాణ టూరిజం కార్పోరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త జన్మదినం సందర్భంగా ఎన్ జి ఓ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం స్టీల్ వాటర్ ట్యాంక్ ను శ్రీ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా ఐవిఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు,జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్ లు మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం 8 వేల మందికి తాళి బొట్లను అందజేసిన గొప్ప సామాజిక సేవకులు ఉప్పల శ్రీనివాస్ గుప్త అని, ఆర్యవైశ్యుల ఐక్యత కోసం రాజకీయంగా సామాజిక ఎదుగుదల కోసం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శప్రాయలుగా నిలవడం జరిగిందని, ఇలాంటి సామాజిక సేవలు మరిన్ని కొనసాగించాలని కోరుకున్నారు. ఐవిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్,కోశాధికారి కస్వ వెంకటేష్, ఆధ్యాత్మిక విభాగం జిల్లా అధ్యక్షులు ఎల్లంకి సుదర్శన్, ఉపాధ్యక్షులు రాజూరి మనోహర్, కొత్త భీమ్ రాజ్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత ఐవిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంత తిప్పలు వచ్చే ముసలోళ్లకు ఎండాకాలంలో ఏం తిరుగుడు






ధన్వాడ,మే 5 (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ఒకటి కాదు..రెండు కాదు..మూడు అసలే కాదు.. దాదాపుగా 10నుంచి 15 రోజులుగా అయ్యోరామ.. మాకు పింఛన్ డబ్బులు ఇవ్వాలని ముసలోళ్ళు.. వికలాంగులు...ఒంటరి మహిళలు పింఛన్ డబ్బుల కోసం ఎండను సైతం లెక్కచేయక పింఛన్ డబ్బుల కోసం ఒకటే తిరుగుడు..అప్పుడు ఇస్తారు..ఇప్పుడు ఇస్తారు అంటూ పింఛన్ డబ్బుల కోసం గంటలు గంటలుగా ఎదురు చూస్తున్నారు.ఇది ఎక్కడో కాదు మండల కేంద్రమైన ధన్వాడలో..విషయానికొస్తే ప్రతి నెల అందించే పింఛన్ డబ్బులు త్వరగా లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికి పది రోజులు దాటిపోయింది అధికారులు అప్పుడు ఇప్పుడు అంటూనే ఉన్నారు తప్ప డబ్బులు మాత్రం ఇవ్వడం లేదు.దీంతో విసుగుచేంది లబ్ధిదారులు ప్రతిరోజు రోడ్డుపై కూర్చొని ఆందోళన చేస్తున్న పాలకులు అధికారుల్లో చలనం రావడం లేదు. అయ్యా మేము కుంటోళ్ళం...రోజు రావడానికి కష్టంగా ఉంది పింఛన్ డబ్బులు ఇవ్వండయ్యా...అయ్యా మేము గుడ్డోళ్ళం కళ్ళు కనిపించవు రోజు రావాలంటే మాకు కండ్లు కనిపించావు పింఛన్ డబ్బులు ఇవ్వండి అయ్యా....అయ్యా మేము ముసలోళ్ళం..మొదలే ఎండాకాలం తాళలేకపోతున్నాం రోజు రావాలంటే చేతకాదు పెన్షన్ డబ్బులు ఇవ్వండి అయ్యా అంటూ ప్రతిరోజు ధన్వాడ పోస్ట్ ఆఫీస్ వద్ద కనిపిస్తున్న దృశ్యాలు అనేకం ఉన్నప్పటికీ కనీసం ఓట్లు వేసుకునే రాజకీయ నాయకులు కానీ అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు.తిండి తిప్పలు వదిలి ఉదయం ఎనిమిది గంటలకే ప్రతిరోజు ధన్వాడ పోస్ట్ ఆఫీస్ వద్దకు వచ్చి గంటలు గంటలుగా పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు మంగళవారం సైతం పింఛన్ డబ్బులు ఇవ్వకపోవడంతో గంటల తరబడిగా పోస్ట్ ఆఫీస్ వద్ద పడిగాపులు కాశారు ఒక దశలో ఆందోళనకు చేయడానికి సిద్ధం అవుతున్న తరుణంలో కొంతమంది నచ్చజెప్పడంతో ఆందోళన విరమించుకున్నారు ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించాలని కోరుతున్నారు

# మిర్యాలగూడలో ఎరువుల విత్తనాల దుకాణాల్లో అధికారులు ఆకస్మికంగా తనిఖీ



మిర్యాలగూడ ప్రతినిధి//మే 5:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడలో ఎరువుల విత్తనాల దుకాణాలను వ్యవసాయ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసారు. వ్యవసాయ అధికారి ఎం రుశేంద్రమని దుకాణాలల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఅన్ని దుకాణాలలో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. లూజు విత్తనాలు నాణ్యతలేని విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతు రసీదు తీసుకోవాలని సూచించారు. అన్ని రకాల విత్తనాలు దిగుబడి ఒకే రకంగా ఉంటుంది అని రైతులకు కొన్ని రకాల విత్తనాలే అధిక దిగుబడి వస్తాయని అపోహ పడకుండా అందుబాటులో ఉన్న విత్తనాలను తెచ్చుకోవాలని లైసెన్స్ ఉన్న షాపులోనే విత్తనాలు కొనాలి అని అన్నారు. విత్తనాలు కొన్న రసీదులు జాగ్రత్తగా ఉంచుకోవాలి అధిక ధరలకు అమ్మితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఫెర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు జవహర్ బాబు వ్యవసాయ విస్తరణ అధికారి షఫీ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా చీరల పంపిణీ చేసిన చైర్ పర్సన్



కామారెడ్డి ,మే 5 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లా కేంద్రంలోని 38వ వార్డులో "ఇందిరమ్మ మహిళా శక్తి" పథకంలో భాగంగా చీరల పంపిణీ కార్యక్రమం మున్సిపల్ చైర్ పర్సన్ కౌన్సిలర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. చీరల పంపిణీ: వార్డులోని అర్హులైన మహిళలకు ఆమె చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే మహిళలు తమ ఆధార్ కార్డు రేషన్ కార్డులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యూనస్, సిద్దిక్, స్థానిక సీనియర్ నాయకులు చాట్ల రాజేశ్వర్, గొనె శ్రీనివాస్, నాగరాణి లతో పాటు అధికారులు, రాజకీయ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి ఎస్.ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



కామారెడ్డి, మే 5 , (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి  మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. బీబీపేట్ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట మెహన్ రెడ్డి గారి కూమార్తె వివాహానికి ఆర్థిక సాయం అందజేశారు. తన కూతురి వివాహం ఈ నెల 8న జరగనుండగా, ఎస్.ఆర్ ఫౌండేషన్ సభ్యులు వారి కుటుంబ పరిస్థితిని సుభాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శారీరక వికలాంగుడుగా ఉన్న మోహన్ రెడ్డి కి ఆర్థిక సహాయం అందించాలని,దమానవతా దృక్పథంతో స్పందించిన సుభాష్ రెడ్డి తన కూతురు వివాహానికి ఫౌండేషన్ ద్వారా రూ.25 వేల నగదును పంపించారు. గతం లో కూడా సుభాష్ రెడ్డి మోహన్ కి త్రీ వీలర్ బైక్  ఉపాధి మరియు రవాణా కోసం ఫౌండేషన్ ద్వారా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు సుభాషన్న గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్ట శ్రీనివాస్, కప్పేరా రవీందర్ రెడ్డి,వెంకట్రాంరెడ్డి,సైదుగారి అశోక్ గౌడ్, చాట్ల బాబు, పిప్పిరిశెట్టి శేఖర్ ,వడ్ల నర్సింహా చారి  పాల్గొన్నారు.

# బాధిత వ్యాపారులకు తక్షణ ఆర్థిక సాయం అంద చేసిన షబ్బీర్ అలీ

కామారెడ్డి, మే 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో తనకు తానే సాటి అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు మహ్మద్అలీషబ్బీర్ మరోసారి నిరూపించుకున్నారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాదం పలువురు చిరు వ్యాపారుల కుటుంబాల్లో చీకటిని నింపింది. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన షబ్బీర్ అలీ మంగళవారం సంఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన 21 షాపుల యజమానులను ఆయన ఒక్కొక్కరినీ వ్యక్తిగతంగా కలిసి, వారికి ధైర్యం చెప్పారు. వ్యాపారం దెబ్బతిని రోడ్డున పడ్డ వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద తీవ్రతను గుర్తించిన ఆయన, ప్రభుత్వ సాయం కోసం వేచి చూడకుండా, తన వంతు బాధ్యతగా ఒక్కో బాధిత వ్యాపారికి 8,000 చొప్పున మొత్తం 21 మందికి సుమారుగా1,70,000/=రూపాయలు తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. "మీరు ఒంటరి వారు కాదు, ఈ ప్రభుత్వం మీ వెంటే ఉంది" అని ఆయన వ్యాపారులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్అలీ తో పాటు కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాధితులకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. రాజకీయ నాయకుడంటే కేవలం ఓట్ల సమయంలోనే కాకుండా, ఆపదలో ఉన్నప్పుడు ఆపన్న హస్తం అందించేవాడని షబ్బీర్ అలీ చాటిచెప్పారు. ఆయన చేసిన ఈ తక్షణ సాయం పట్ల ఇందిరా చౌక్ వ్యాపారులు మరియు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా ఏ టీ యాదవ్ జన్మదిన వేడుకలు




గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 5

అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు ఏ. టి యాదవ్ జన్మదిన వేడుకలు అఖిల భారత యాదవ మహాసభ గంభీరావుపేట మండల అధ్యక్షులు దోమకొండ కృష్ణ కాంత్ యాదవ్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న మా అనాథ వృద్ధాశ్రమంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరిపారు ఈ సందర్భంగా ఏటి యాదవ్ చేత కేక్ కట్ చేయించారు అనంతరం వృద్ధాశ్రమంలో గల వృద్ధులకు పండ్లు మజ్జిగ ప్యాకెట్లు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏటి యాదవ్ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని ఆయన హర్షం వ్యక్తం చేశారు తన జన్మదిన వేడుకలు జరిపిన గంభీరావుపేట యాదవ సంఘం మండల కమిటీ కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షులు దోమకొండ కృష్ణ కాంత్ యాదవ్ తో పాటు అఖిలభారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒగ్గు బాలరాజు యాదవ్ ఆసరి బాలరాజు యాదవ్, గంభీరావుపేట యాదవ సంఘం మండల ఉపాధ్యక్షులు ఎక్కల్ దేవి చంద్రం యాదవ్ మల్లారెడ్డిపేట సర్పంచ్ చేకుటి మహేష్ యాదవ్, గొడుగు దేవయ్య యాదవ్,ఎలుక మల్లేష్ యాదవ్, పరామల మల్లేష్ యాదవ్, దేవేందర్ యాదవ్ గుడి కాడి శ్రీకాంత్ యాదవ్ శేఖర్ యాదవ్ బాబు యాదవ్ వెంకట యాదవ్ దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గాయపడి చికిత్స తీసుకుంటున్న గంట శ్రవణ్ రెడ్డి పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



మిర్యాలగూడ ప్రతినిధి//మే 5:(తెలంగాణ పత్రిక):-

ఇటీవల గాయపడి చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న గంటా శ్రావణ్ రెడ్డి మరియు పల్నాటి జానకి రెడ్డి ని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారికీ ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మీకు ఏ టైంలో అవసరమైన మా యొక్క సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని వారు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు మరియు ప్రజల ఆరోగ్యం తమకు ఎంతో ముఖ్యమని ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. వారి వెంట దుర్గంపూడి నారాయణరెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ లావూరి అరుణ సుధాకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# గంభీరావుపేటలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేలు





-ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి
-ప్రధాని మోడీకి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి
-రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోవాలి
-పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా చేసి రైతులు అదనపు ఆదాయం పొందాలి
-ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుంది

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 05

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామంలోని మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం పంతులు తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి భూమి పూజ చేశారు అలాగే సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గం లోని 11 ప్రాంతాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కేవీ సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు విజ్ఞప్తి చేశారు రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ( ఎం ఎస్ పి) ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం మొత్తం తీసుకోవాలని కోరారు. రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏ క్యూ ఐ) పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించినప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాష్ట్ర వక్ఫు బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ చొప్పదండి శాసనసభ్యులు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డీఎస్పీ నాగేంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు బడిని కాపాడుకుందాం మన పిల్లల భవిష్యత్తుని నిర్మించుకుందాం

-అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలు అర్హదలేని ఉపాధ్యాయులు
-కఠినమైన పరీక్షలు అర్హత ప్రమాణాలతో ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులు
-ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉచిత బోధన మధ్యాహ్న భోజనం
-కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధన
-డిజిటల్ క్లాసులు
-పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు
-ఘన సన్మానం నగదు అందజేత
-సర్పంచ్ ఐలోని రజిత అశోక్

నర్సంపేట మే 05 తెలంగాణ పత్రిక

జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల గ్రామం. లక్నేపల్లి. నర్సంపేట వరంగల్ లక్నపల్లి గ్రామ సర్పంచ్ ఐలోని రజిత అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం రోజు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదోవ తరగతిలో విద్యార్థిని విద్యార్థులు వారి యొక్క ప్రతిభను కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులను సాధించి గ్రామంలోని తోటి విద్యార్థిని విద్యార్థులందరికీ గవర్నమెంట్ స్కూల్స్ అంటే ప్రైవేట్ స్కూల్స్ ని మించిన విద్య ఇక్కడ బోధించబడుతుంది అనే తెలియపరుస్తూ జిల్లా సెకండరీ పాఠశాలకి లక్నేపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది ఇలానే మన గ్రామంలో ఉన్న విద్యార్థిని విద్యార్థులు అందరూ వారి తల్లిదండ్రులు మన పిల్లల భవిష్యత్తు బాగుండేలా మన గ్రామం మనబడి అనే నినాదంతో గ్రామంలో పిల్లలందరూ బడిబాటలో భాగంగా ముమ్మందు విద్యార్థిని విద్యార్థులు అందరూ మన గ్రామ స్కూల్లో విద్యను అభ్యసించి మొదటి స్థానంలో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రథమ ద్వితీయ తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు లక్నేపల్లి గ్రామ పంచాయతీ తరపున ఐలోని రజిత అశోక్ సన్మానించి వారికి నగదు బహుమతిగా అందించడం జరిగింది. మన ఊరు మనబడిని కాపాడుకుందాం మన పిల్లల భవిష్యత్తుని నిర్మించుకుందాం.






# ఓటాయి ధాన్యం కేంద్రంలో అక్రమాలపై విచారణ చేపట్టాలి

-వడ్డీ వ్యాపారి కనుసన్నల్లో రైతులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని తుడుందెబ్బ డిమాండ్
-చర్యలు తీసుకోకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
-హెచ్చరించిన తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగబోయిన రవి

కొత్తగూడ మండల ప్రతినిధి:మే 05. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రం పరిధిలోని ఓటాయి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలు అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మార్క్ ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఒక వడ్డీ వ్యాపారికి అప్పగించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ:- ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ సంస్థలు లేదా మహిళా సంఘాలు నిర్వహించాలి. కానీ! ఓటాయిలో వడ్డీ వ్యాపారి అయిన పబ్బా శ్రీనివాస్ తన అనుచరుడైన, వల్లెపు రమేష్‌ను అడ్డుపెట్టుకొని ఈ సెంటర్‌ను నడుపుతున్నారని ఆయన ఆరోపించారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలన్న ప్రభుత్వ ఆశయం ఇక్కడ నీరుగారుతోందని మండిపడ్డారు. క్వింటాకు 2 కేజీల తరుగు:- వడ్డీ వ్యాపారి తన పలుకుబడిని ఉపయోగించి సెంటర్‌కు వచ్చే రైతుల వద్ద నుండి క్వింటాకు 2 కేజీల చొప్పున అక్రమంగా తరుగు తీస్తున్నారని, ఇది పచ్చి దోపిడని ఆగబోయిన రవి విమర్శించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న సదరు వ్యక్తులపై విచారణ జరిపి, తక్షణమే ఆ సెంటర్ లైసెన్స్‌ను రద్దు చేయాలని ఆయన కోరారు.



డిమాండ్లు:- వడ్డీ వ్యాపారి పబ్బా శ్రీనివాస్ నుండి సెంటర్ నిర్వహణను రద్దు చేయాలి. స్థానిక గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కి ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగించాలి. రైతుల వద్ద నుండి అక్రమంగా తరుగు తీస్తున్న గుమస్తాపై చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో కొత్తగూడ తహసీల్దార్ కార్యాలయం ముందు భారీ ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

# గ్రామ అభివృద్ధి కోసం నిధులు కేటాయించండి

-ఉపముఖ్యమంత్రి కి వినతి పత్రం అందించిన సర్పంచ్ మల్లు గారి పద్మ

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 5

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామం అభివృద్ధిలో వెనుకబడి ఉన్నదని మా గ్రామ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని స్థానిక సర్పంచ్ మల్లుగారి పద్మ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కు కోరారు సర్పంచ్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరముల నుండి నత్తనడకన సాగుతున్న గంభీరావుపేట వాగు బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని రోడ్డు వెడల్పు లైటింగ్: పెద్దమ్మ గుడి నుండి లింగన్నపేట వరకు నాలుగు వరుసల రోడ్డును సెంట్రల్ లైటింగ్‌తో సహా మంజూరు చేయించగలరు రోడ్డు విస్తరణ వల్ల నష్టపోయే వారికి తగిన సహాయం అందించాలని కోరారు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరారు కేజీ టు పీజీ వరకు చదివే బాలికల బాలుర కోసం మోడల్ హాస్టల్ బిల్డింగ్స్ మంజూరు చేయాలి మార్కెట్ సెంటర్ ఎస్సీ బీసీ మైనారిటీ కాలనీలలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని చారిత్రక ప్రాధాన్యత కలిగిన రామాలయ అభివృద్ధి చేయాలి పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు యువకులకు, మహిళలకు ఉపాధి అవకాశాలు నడిపించాలి మురికిగా మారుతున్న వెంకటాద్రి చెరువును విశాలంగా ఉన్న నవాబ్ చెరువును అభివృద్ధి పరిచి 'ట్యాంక్ బండ్'గా మార్చాలని లింక్ రోడ్ల మంజూరు, కొత్త బస్ సర్వీసుల విస్తరణ బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టాలి కోరారు అన్ని సమస్యలను త్వరలోనే నెరవేరుస్తామని సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఆది



శ్రీనివాస్ ఇతర నాయకులకు సర్పంచ్ మల్లు గారి పద్మ తన తరపున గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు.

# బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడే దిశగా చర్యలు





-తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి

మెదక్ జిల్లాప్రతినిధి (తెలంగాణ పత్రిక) 05 మే

నర్సాపూర్ బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడే దిశగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నరసాపూర్ పట్టణంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన, అపర్ణ, బి. వచన్ కుమార్ కమిషన్ సభ్యులు విస్తృతంగా పర్యటించారు. నర్సాపూర్ పర్యటనకు విచ్చేసిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతారెడ్డికి మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ స్వాగతం పలికారు. ముందుగా నరసాపూర్ పట్టణంలోవికాసం వికలాంగుల పునరావాస కేంద్రం సందర్శించి బాల బాలికల సంరక్షణ కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. శారీరక వైకల్యం కలిగిన వికలాంగ చిన్నారిని చూసి చే లించిన హృదయంతో ఆ చిన్నారికి ఆపరేషన్ ద్వారా వైకల్యాన్ని సరిచేసి పౌష్టికాహారం అందించి విద్యాబుద్ధుల నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. భవిత కేంద్రాలు ఆదర్శవంతంగా పనిచేస్తున్నాయని చిన్నారులకు ఆటపాటలతో కూడిన నైపుణ్యాలు నేర్పుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. శివం పేట బేతని సంరక్షణ ఆశ్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి సారిస్తుందని కమిషన్ సభ్యులు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ బాలల హక్కుల ఉల్లంఘనలు, పౌష్టికాహార లోపం, మరియురాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, మెరుగైన విద్య, ఆరోగ్యం, మరియు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం పిల్లలపై దాడులను అరికట్టడానికి కమిషన్ కట్టుబడి ఉందని, ప్రతి 6 నెలలకు లేదా ఏడాదికి ఒకసారి సంరక్షణ కేంద్రాల పనితీరును సమీక్షిస్తామని కమిషన్ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో మహిళా శ్రీ శిశు సంక్షేమ అధికారి హేమ భార్గవి, రామాయంపేట సిడిపిఓ స్వరూప, డిసిపిఓ నాగరాజు,జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ హైవే రోడ్డు పైన ప్రమాదం

-ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు

జహీరాబాద్ తెలంగాణ పత్రిక మే 5

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లోని పట్టణ పరిధిలో జాతీయ రహదారి 65పై మంగళవారం తెల్లవారుజామున 05:40 నిమిషాలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కేసారం గ్రామానికి చెందిన కాసుల మహేష్ గౌడ్ (27), తన స్నేహితులు మరియు బంధువులతో కలిసి సోమవారం రాత్రి మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత దర్శనానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని మంగళవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా, జహీరాబాద్ శివారులోని పస్తాపూర్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన టాటా ట్రాలీ ఆటో కి కారు వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీట్లో కూర్చున్న కాసుల మహేష్ గౌడ్ (27) మరియు వెనుక సీట్లో ఉన్న మైలాపురం రోహిత్ కుమార్ (17) తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే



మరణించారు. కారులో ఉన్న మిగిలిన వారు నాంపల్లి కార్తీక్ (27),ఆతేంద్ర సాయి (9),నితిన్ గౌడ్ (6),కె. నర్సింలు (32) వీరికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ట్రాలీ ఆటో డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్లు లేదా హెచ్చరిక సంకేతాలు లేకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై వాహనాన్ని నిలిపి ఉంచడమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. మృతుడి తండ్రి కాసుల



సుదర్శన్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ ఎస్.ఐ వినయ్ కుమార్ ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టనైనది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# యూసుఫ్ పేట లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఎల్లమ్మకు బోనాలు





-భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్న గౌడ సంఘం సభ్యులు

-శివసత్తుల పూనకాలు పోతరాజుల విన్యాసాలు

పాపన్నపేట, ప్రతినిధి మే 05:(తెలంగాణ పత్రిక)

పాపన్నపేట మండలంలోని యూసుఫ్ పేట గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే గౌడ కులస్తుల ఇళ్లల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం పోసి, తమ కుటుంబాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. గౌడ సంఘం పెద్దలు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సమయంలో వేప కొమ్మలు, కుంకుమ, పసుపు, పూలు, నైవేద్యంతో అందంగా అలంకరించిన కుండలను మహిళలు నెత్తిన పెట్టుకొని గ్రామం పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. యువకులు, పోతరాజులు డీజే చప్పుల మధ్య నృత్యం చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు, సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బంధుమిత్రులతో సందడి వాతావరణం నెలకొంది.

## షబ్బీర్ అలీనికలిసిన రాజంపేట కాంగ్రెస్ నాయకులు



కామారెడ్డి , మే 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా రాజంపేట మండల నూతన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా అంకం కృష్ణ రావు నియమితులైన సందర్భంగా ఈరోజు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు యాదవరెడ్డి, సీనియర్ నాయకులు వీరన్న, బెస్త చంద్రం, సుధాకర్ రెడ్డి, నాగరాజు, సుధాకర్, నిట్టు ఆనంద్ రావు, బాబు, దిలీప్ కుమార్, శివ కుమార్, శ్రవణ్ రెడ్డి, యాదగిరి, బాలయ్య, సిద్దారములు, ఫైజల్, ఇమ్రాన్, జమీల్, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, తతిదారులు పాల్గొన్నారు.

## పాల్వంచ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి, మే 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

మంగళవారం కామారెడ్డిజిల్లా కలెక్టర్ పాల్వంచ మండలంలోని పీఏసీఎస్ మాచారెడ్డి పరిధిలో కొనసాగుతున్న పాల్వంచ పీపీసీ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వరి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుండగా, ఒక లారీ లోడింగ్ పూర్తయినట్లు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ డీసీవో, డీఎంసీఎస్, డీసీఎస్ఓ అధికారులకు తూకం ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతుల ధాన్యం త్వరితగతిన కొనుగోలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సరిపడా రవాణా సౌకర్యాలు కల్పించి, రైస్ మిల్లుల వద్ద వాహనాల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.దరైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పీపీసీల వద్ద అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, వరి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. వరి కొనుగోలు పూర్తిగా ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం చేపట్టాలని, ధాన్యసేతు యాప్‌లో కొనుగోలు వివరాలను నమోదు చేయాలని, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. అలాగే కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలని, అన్‌లోడింగ్ అనంతరం వెంటనే ట్రక్ చిట్స్ తీసుకురావాలని, ట్యాబ్ ఎంట్రీలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యం, ధాన్య కుప్పలను వర్షాల నుండి రక్షించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీవో, డీసీఎస్ఓ, డీఎంసీఎస్, ఎంఎస్ఓ, ఫీల్డ్ ఆఫీసర్, తహసీల్దార్, డీటీసీఎస్, ఏఈఓ, సర్పంచ్, కార్యదర్శి, పీపీసీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బీబీపేట సొసైటీ చైర్మన్ గా ఇంద్రసేనారెడ్డి పునర్ నియామకం

కామారెడ్డి ,మే 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాబీబీపేటలో కల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా శ్రీ ఏదుల్ల ఇంద్రసేనారెడ్డి గారిని పునర్ని నియమిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు, తదుపరి సహకార సంఘం ఎన్నికలు నిర్వహించేంతవరకు మీరు చైర్మన్ గా ఉంటారు, తిరిగిచైర్మన్ గా నియమించినందుకు ప్రభుత్వానికి ఇంద్రసేనారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామ అభివృద్ధి కోసం ఉపముఖ్యమంత్రి కి వినతి పత్రం అందించిన ఉపసర్పంచ్ కమలాకర్ రెడ్డి

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 5



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి మంగళవారం రోజున ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్యటనలో భాగంగా వచ్చిన సందర్భంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికిన మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి పాలకవర్గం సభ్యుల తో కలిసి త్వరగ బ్రిడ్జి పూర్తి చేయాలని గత ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్ వెడల్పు పూర్తి చేయాలని మార్కెట్ సముదాయం నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని గత ప్రభుత్వం నిర్మించిన క్లస్టర్ హాస్పిటల్ ఓపెనింగ్ చేయాలని దానితోపాటు 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రి గా మార్చాలని ఉప ముఖ్యమంత్రి కి వినతి పత్రం అందించారు దానికి సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు వారికి గ్రామపంచాయతీ పక్షాన ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యదర్శిగా సత్తయ్య, సుధాకర్ నియామకం



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) మే 5

తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కర్రె సత్తయ్య, జిల్లా కార్యదర్శిగా బందెల సుధాకర్ మంగళవారం నియామకం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తమ సేవలను గుర్తించి అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి బందెల సాయిలు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రం నియామక పత్రాలను అందజేశారు. ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడుతామన్నారు. బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్



కామారెడ్డి, మే 5 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం లింగుపల్లి లో ఏర్పాటు చేసినవడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర రావడానికి ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జెయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు రాకుండా చూడాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఎప్పటికీ అప్పుడు కంటా అయినవి రైస్ మిల్లులకు ట్రాన్స్పోర్ట్ చేసి, ట్యాబ్ ఎంట్రీ త్వరగా చేయాలని సెంటర్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐకిష్టయ్య , పంచాయతీ కార్యదర్శి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏ పీఎం శ్రీనివాస్, సీ సీ,సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైన రామచంద్రన్ సన్మానించిన ఎస్సై శివానందం



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక ) మే 5:

అంబేద్కర్ సంఘం నేషనల్ అవార్డుకు ఎంపికైన అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రం ఎస్సై శివానందం మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాధ్యత రహితంగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి బందెల సాయిలు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గపతి, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె సత్తయ్య, మెదక్ కాన్స్టెన్సీ ఇంచార్జి కర్ణ సాయిలు, అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి బందెల సుధాకర్, అంబేద్కర్ సంఘం నాయకులు జనార్ధన్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## మేక మన్వితను సన్మానించిన డీఈవో

తెలంగాణ పత్రిక/దమ్మపేట(మే 05)



దమ్మపేట మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో పదోవ తరగతిలో 600 కి గాను 571 అత్యధిక మార్కులు సాధించిన నాగుపల్లి పాఠశాల విద్యార్థిని మేక మన్వితని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సన్మానించిన డీఈవో. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ జగపతి, నాగుపల్లి జెడ్పీహెచెస్ ప్రధానో పాధ్యాయరాలు కందిమళ్ళ సరళ తదితరులు ఉన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేద్దాం





పాపన్నపేట, ప్రతినిధి మే 05:(తెలంగాణ పత్రిక)

ఈనెల 10న దేశ ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ వస్తున్నారని, ఈ సందర్భంగా ఏర్పాటు చేసే బహిరంగ సభను విజయవంతం చేయాల్సిందిగా మండల బిజెపి అధ్యక్షులు సంతోష్ చారి పిలుపునిచ్చారు. 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ జరుగునున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పాపన్నపేట మండలం నుండి పెద్ద ఎత్తున బిజెపి శ్రేణులు, అభిమానులు కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్యకర్తల తరలింపునకు సభ సన్నహాక సమావేశం మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, సీనియర్ నాయకులు నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి నాగభూషణం, లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు బొక్కల భాగేష్, మల్లేశం, కార్యదర్శులు వెంకట్, వడ్ల చంద్రశేఖర్, రాజు, సాయిబాబా, సున్నం లక్ష్మణ్, సాయిలు, శంకరయ్య, మల్లేశం, ఓ బి సి మోర్చా వడ్ల భాగేష్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు గౌస్, యువ మోర్చా అధ్యక్షులు జగదీష్, తాడేపు శేఖర్, చక్రపాణి, కుమార్, గోపాల్, కోశాధికారి రాజేందర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి






-రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
-ఉత్తర తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు

కామారెడ్డి, మే 05 ,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశు ద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం ఉత్తర తెలంగాణా స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఉత్తర తెలంగాణా జిల్లాల నుండి విచ్చేసిన అదనపు కలెక్టర్లు తమతమ జిల్లాలలో స్థానిక సంస్థల పనితీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని హితవు పలికారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి, అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశు ధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు, చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని అన్నారు. స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందిం చుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు. సదస్సులో నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి, ఉత్తర తెలంగాణ జిల్లాల అదనపు కలెక్టర్లు దిలీప్ కుమార్, అశ్విని తానాజీ వాకడే, రాజాగౌడ్, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, నిజామాబాద్ జెడ్పీ సీ.ఈ.ఓ సాయగౌడ్, డీపీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కమిషనర్ లు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి సబ్ జైలును సందర్శించిన దమ్మపేట మండల న్యాయ సేవా అధికార కమిటీ చైర్మన్ డా. బొమ్మతి భవాని

తెలంగాణ పత్రిక దమ్మపేట మే 5




ఈ రోజు దమ్మపేట మండల న్యాయ సేవా అధికార కమిటీ చైర్మన్ డాక్టర్ బొమ్మతి భవాని సత్తుపల్లి సబ్ జైలు ను అధికారికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జైల్లో ఉన్న ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని, వారికి లభించే చట్టపరమైన హక్కులు మరియు న్యాయ సహాయం గురించి విస్తృతంగా అవగాహన కల్పించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు, వేగవంతమైన విచారణ హక్కు, ఆరోగ్య సేవలు పొందే హక్కు వంటి ముఖ్యమైన అంశాలపై వివరంగా చర్చించారు. అదేవిధంగా, న్యాయ సేవా సంస్థల ద్వారా అందించే సేవలను ఎలా వినియోగించుకోవాలో వారికి స్పష్టంగా తెలియజేశారు. ఈ సందర్శనలో భాగంగా ఖైదీల అభ్యర్థనలు, సమస్యలను శ్రద్ధగా విని, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమాజంలో న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఖైదీలలో చట్టాలపై అవగాహన పెంపొందించడం, వారి హక్కుల రక్షణకు బాటలు వేయడం ప్రధాన ఉద్దేశ్యమని కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అడమ్స్,జైల్ సూపరింటెండ్ కుటుంబ రాజు,కోర్ట్ సూపరిం టెండెంట్ సిద్ధార్థ్ మరియు కోర్ట్ సిబ్బంది రాజ్ కుమార్, కోర్ట్ పోలీసులు రాంబాబు,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# రైతులు ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి పెట్టాలి





**-జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు**

కామారెడ్డి ,మే 5 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాజుక్కల్ మండల కేంద్రంలో ఆయిల్ పామ్ తోటలో నిర్వహించిన కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతారావు పాల్గొని పంటను పరిశీలించారు.ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటలపై రైతులతో ముఖాముఖి మాట్లాడి అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ పంటలో నాటిన తరువాత సుమారు నాలుగు సంవత్సరాల నుంచి దిగుబడి ప్రారంభమై, ఆర్థిక లాభాలు క్రమంగా పెరుగుతాయని వివరించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణతో వచ్చే లాభాలను తెలియజేసి, రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలని సూచించారు. ఆయిల్ పామ్ వేసిన రైతులకు ఎమ్మెల్యే సన్మానించారు. అలాగే ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు అన్ని విధాలుగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నది ఈ ప్రభుత్వం --- ఇదే ప్రజా ప్రభుత్వం అని ఎమ్మెల్యే తెలిపారు

# ప్రమోషన్లతో సేవల్లో మరింత నిబద్ధత అవసరం





**-పదోన్నతులు కృషికి గుర్తింపు**
**-పదోన్నతులతో బాధ్యతలు రెట్టింపు:**
**-ఎస్పీడి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్**

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 05 మే

పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించే సిబ్బందికి తగిన గుర్తింపు ఎప్పటికప్పుడు లభిస్తుందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పేర్కొన్నారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పదోన్నతులు లభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కానిస్టేబుల్ స్థాయి నుండి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వారిలో హవేలీఘనపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన నరహరి, నార్సింగి పోలీస్ స్టేషన్‌కు చెందిన మోహన్, మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన గోవర్ధన్, మెదక్ టౌన్ ట్రాఫిక్ విభాగానికి చెందిన తహెర్ అలీ ఉన్నారు. విధి నిర్వహణలో వారి అంకితభావం, కృషికి గుర్తింపుగానే ఈ పదోన్నతులు లభించాయని తెలిపారు. పదోన్నతి పొందిన సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా వారికి కొత్త హోదా చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "పదోన్నతులు కేవలం హోదాను మాత్రమే కాదు, బాధ్యతలను కూడా పెంచుతాయని, సిబ్బంది మరింత నిబద్ధతతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణే మన ప్రధాన లక్ష్యం" అని సూచించారు. విధి నిర్వహణలో నిజాయితీ, బాధ్యతతో పనిచేస్తే ఉన్నత స్థాయికి ఎదగడం సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సిబ్బంది కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.

# సూర్యనారాయణ జ్ఞాపకార్థం శ్రీ అభయాంజనేయ స్వామికి విరాళం

**-అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి ఆదేశానుసారంగా**
**-కీర్తిశేషులు తుప్పరి సూర్యనారాయణ పేరుతో రూ.50,116 భారీ విరాళం**
**-రాంపూర్‌లో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి**

పరకాల/గీసుకొండ/ మే 05 తెలంగాణ పత్రిక

అల్లం స్వప్న బాలకిషన్ రెడ్డి ఆదేశానుసారంగా రాంపూర్ గ్రామంలో నిర్మాణం అవుతున్న శ్రీ అభయాంజనేయ స్వామి గుడి నిర్మాణము మరియు ప్రతిష్టాపన కార్యక్రమానికి విశేష సహకారం అందింది.కీర్తిశేషులు గీసుకొండ మాజీ జడ్పిటిసి తుప్పరి సూర్యనారాయణ కుమారులు తుప్పరి వికాస్ రూ.50,116/- విరాళాన్ని అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా రాంపూర్ గ్రామ సర్పంచ్ రడం భరత్ కి, అలాగే గుడి చైర్మన్ తాబేటీ వెంకటేశ్వర్లు కి అందజేశారు.ఈ కార్యక్రమంలో మనుకొండ సర్పంచ్ పేర్ల శ్రవణ్, గీసుకొండ మాజీ సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్, మాదాసి రాంబాబు, మనుకొండ మాజీ సర్పంచ్ చాపర్తి కనకయ్య, గాడిదల బొంద్యాలు, యాగోని రజనీకాంత్, పేర్ల రవి, ఓదెల సురేష్, బుసాని సాంబయ్య, కందికొండ రాజు, దర్శనాల రాజు,తుప్పరి రాజు,



బోయ అశోక్, బోయ అఖిల్, ముగల రణదీప్ , మంద అనిల్, దర్శనాల రాజేష్, తాబేటీ వీరాస్వామి మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.అల్లం బాల కిషోర్ రెడ్డి యువ సైన్యం.

# కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షునిగా రేవూరి జలంధర్ రెడ్డి ఎన్నిక

ఆత్మకూరు:మే 05, (తెలంగాణ పత్రిక):

ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన రేవూరి జలంధర్ రెడ్డిని పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షునిగా నియమించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది.రేవూరి జలంధర్ రెడ్డి గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించిన ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించబడటం విశేషం. ఈ నియామకంపై ఆత్మకూరు మండలంలోని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, జలంధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకత్వంలో ఆయన పార్టీని మరింత బలపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేవూరి జలంధర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అహర్నిశలు శ్రమిస్తానని, ప్రతి కార్యకర్తతో కలసి పనిచేస్తూ ప్రజలకు దగ్గరగా ఉండే విధంగా పార్టీ కార్యక్రమాలను అమలు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి మరియు సంక్షేమం దిశగా కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ నియామకంతో మండలంలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు రావాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.



# గంభీరావుపేటకు చేరుకున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

**-స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 5

జిల్లా పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు గంభీరావుపేట మండలకేంద్రానికి చేరుకోగా.. వారికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్పగుచ్ఛం అందజేసి.. స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ పాల్గొన్నారు.



## పది ఫెయిల్ అయిన విద్యార్థులకు నేటి నుండి ప్రత్యేక తరగతులు

పాపన్నపేట, ప్రతినిధి మే 05:(తెలంగాణ పత్రిక)



ఇటీవల జరిగిన జరిగిన ఎస్ ఎస్ సి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థిని విద్యార్థులకు ఈనెల 6 నుండి పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి వెల్లడించారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల 30 నిమిషాల వరకు ప్రత్యేక తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులకు అల్పాహారం తో పాటు రవాణా ఖర్చులు కూడా చెల్లిస్తారన్నారు. ఇటీవల ఫెయిల్ అయిన విద్యార్థులు అందరూ హాజరయ్యేలా సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులు చూడాలని ఎంఈఓ సూచించారు.

## కార్మికులు కార్మిక శాఖ గుర్తింపు కార్డులు పొందాలి

**-మున్సిపల్ చైర్మన్ కట్కం రవి**



రాయికల్ మండల మే 5( తెలంగాణ పత్రిక)

అసంఘటిత కార్మికులు తప్పని సరిగా తమ వివరాలు నమోదు చేసుకుని లేబర్ కార్డు పొందాలని, తద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు.. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మెట్ పల్లి కార్మిక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో లేబర్ కార్డుల నమోదు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.. ఈనెల 10 వరకు మండల కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మెట్ పల్లి అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారి కృష్ణ సాగర్ అన్నారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూక్యా రాకేష్ నాయక్, పుర్రె శ్రీధర్, నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి ,మచ్చ శేఖర్, తోపరపు సురేష్, వేముల రాము,వాసం రాజేంధర్,ఎనుగందుల లింగం,అలీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా టాపర్ కావ్యశ్రీని సన్మానించిన ఎస్సై రఘుబాబు గౌడ్

**-ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత బోధనలు**
**-నేను మల్లంపల్లి హైస్కూల్ లో చదువుకున్న పూర్వ విద్యార్థినే**
**-నాగార్జున సాగర్ డ్యాం ఎస్సై బూర రఘుబాబు గౌడ్**

నర్సంపేట /దుగ్గొండి/ మే 05 తెలంగాణ పత్రిక



ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి వరంగల్ జిల్లా టాపర్ గా నిలిచిన మల్లంపల్లి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ తడుక కొమురయ్య సువర్ణ మనవరాలు జనగాం కావ్యశ్రీ ఘన సన్మానం జరిగింది.దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి హైస్కూల్ విద్యార్థినీ కావ్యశ్రీని అదే గ్రామానికి చెందిన ప్రస్తుతం నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ డ్యాం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న బూర రఘుబాబు గౌడ్ మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్ పట్ల ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు.ఈ సందర్భంగా ఎస్సై బూర రఘుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తను కూడా ఇదే ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించి నేడు ఈ స్థాయిలో ఉన్నానని పూర్వ విద్యార్థి జ్ఞాపకాలను గుర్తుకుచేశారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిగమించాలని ఈ సందర్భంగా ఎస్సై రఘుబాబు గౌడ్ జిల్లా టాపర్ జనగాం కావ్యశ్రీకి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తాలూకా కొమురయ్య సువర్ణ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోక్స్ కేస్ నిందితుడికి జీవిత ఖైదు కామారెడ్డి కోర్ట్ సంచలన తీర్పు

కామారెడ్డి, మే 05,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

పోక్సో కేసులను కామారెడ్డి కోర్టు సీరియస్గా పరిగణిస్తోంది. గతేడాది మార్చి చివరి వారంలో ముగ్గురు పోక్సో నిందితులకు 20ఏళ్ల పాటు జైలు శిక్ష విధించగా తాజాగా మంగళవారం మరో కేసులో జీవితఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని పట్టణంలోని ఒక ప్రైవేట్ కాలేజీలో చదువుకుంటుండగా అదే కాలేజీలో చదువుతున్న తోకల రాజశేఖర్ అనే యువకుడు ఆమెను ప్రేమిస్తున్నానని వేధించాడు. ఆమె తనకు ఇష్టం లేదని చెప్పినప్పటికీ ఆత్మహత్య చేసుకుంటానని ఆమె ఫోన్కు వీడియోలు పంపి భయపెట్టాడు. ఈ క్రమంలో ఆమెతో మాట్లాడిన ఫోన్ రికార్డులను దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించాడు. ఆ అమ్మాయికి మాయమాటలు చెప్పి ఒంటరి ప్రదేశానికి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు.ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణ అనంతరం తోకల రాజశేఖర్ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పోక్సో చట్టం కింద కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలు, వైద్య నివేదికను పరిశీలించిన మీదట న్యాయస్థానం ఈ తీర్పు వెల్లడించింది.

# ప్రభాస్ సినిమా షూటింగ్.. ఘోర ప్రమాదం.. ఒకరి మృతి



తెలంగాణ పత్రిక మే 5

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ' సెట్స్‌లో విషాదం నెలకొంది. ఈ ఉదయం షూటింగ్ నిమిత్తం వెళ్తున్న యూనిట్ సభ్యుల కారు హైదరాబాద్ శివార్లలోని అబ్దుల్లాపూర్ మెట్ వద్ద ప్రమాదానికి గురైంది. కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. సినిమా షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్న సమయంలో తమ సహచరుడు మరణించాడనే సమాచారంతో చిత్ర యూనిట్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. మరోవైపు, సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా యూనిట్‌లో ఈ ఘటన విషాద ఛాయలను నింపింది. మృతుడి కుటుంబానికి చిత్ర బృందం తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

# 'ఆర్‌సీ 17' పై క్రేజీ అప్‌డేట్.. జులై నుంచి సెట్స్‌పైకి చరణ్-సుకుమార్ సినిమా

- 'రంగస్థలం' తర్వాత మళ్లీ రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్
- ఆర్‌సీ 17 రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జులై నుంచి ప్రారంభం
- మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం
- బుచ్చిబాబు దర్శకత్వంలో చరణ్ నటించిన 'పెద్ది' జూన్ 4న విడుదల



తెలంగాణ పత్రిక మే 5

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన అభిమానులకు ఒకేసారి రెండు పెద్ద శుభవార్తలు అందించారు. ఒకవైపు ఆయన నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టించిన 'రంగస్థలం' కాంబినేషన్ మళ్లీ సెట్స్ మీదకు వెళ్లేందుకు ముహూర్తం ఖరారైంది. దర్శకుడు సుకుమార్‌తో చరణ్ చేయబోతున్న కొత్త సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జులై నుంచి ప్రారంభం కానుంది. ఈ వార్తతో మెగా అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దర్శకుడు సుకుమార్ స్క్రిప్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పక్కా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారని సమాచారం. జులైలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలలో ఒకరైన చెర్రీ స్వయంగా ధ్రువీకరించారు. 'రంగస్థలం'కు బ్లాక్‌బస్టర్ ఆల్బమ్ అందించిన దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తుండటం విశేషం. 2018లో వచ్చిన 'రంగస్థలం' రామ్ చరణ్ కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. చిట్టిబాబు పాత్రలో చరణ్ నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడమే కాకుండా జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది. అందుకే 'ఆర్‌సీ 17' ప్రాజెక్ట్ పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. సుకుమార్ ఈసారి ఎలాంటి కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తారోనని అందరూ ఎదురుచూస్తున్నారు. ఇక, సుకుమార్ సినిమా పట్టాలెక్కడానికి ముందే, రామ్ చరణ్ 'పెద్ది' చిత్రంతో ప్రేక్షకులను పలకరించనున్నారు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా జూన్ 4న విడుదల కానుంది. 1980ల నాటి ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో చరణ్ 'పెద్ది పెహిల్వాన్' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ'గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. మొత్తానికి రెండు విభిన్నమైన, భారీ చిత్రాలతో రామ్ చరణ్ సినీ ప్రియులకు డబుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు.

# మెట్ గాలాలో ఇషా అంబానీ రాయల్ లుక్..


## 1800 క్యారెట్ల వజ్రాల బ్లౌజ్.. నిజాం కాలపు నగల మెరుపు!



తెలంగాణ పత్రిక మే 5

మెట్ గాలా 2026 వేదికపై రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ ముద్దుల తనయ ఇషా అంబానీ తన అద్భుతమైన వస్త్రధారణతో భారతీయ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పారు. ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన ప్రత్యేకమైన చీరకట్టులో ఆమె మెరిసిపోయారు. ఈ చీర పై చేత్తో చిత్రించిన 'పిచ్వాయ్' కళాఖండాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రిలయన్స్ రీటెయిల్ సంస్థ 'స్వదేశ్'కు కళాకారులు స్వచ్ఛమైన బంగారు తీగలతో నేసిన అంచు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా ఆమె ధరించిన బ్లౌజ్ 1800 క్యారెట్ల వజ్రాలు, ఎమరాల్డ్స్, పోల్కీ నగలతో మెరిసిపోవడమే కాకుండా... అందులో నిజాం నవాబుల నాటి అరుదైన 'సర్ పేచ్' ఆభరణాన్ని చేర్చడం ఒక చారిత్రాత్మక స్పర్శను ఇచ్చింది. ఈ ఆభరణాలన్నీ తన తల్లి నీతా అంబానీ కలెక్షన్ లోనివని ఇషా పేర్కొన్నారు. వీటితో పాటు, సుబోధ్ గుప్తా రూపొందించిన క్రోచెట్ బ్యాగ్‌లో మామిడి పండును పట్టుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సౌరభ్ గుప్తా పేపర్, ఇత్తడితో రూపొందించిన 'గజ్రా'ను తలలో అలంకరించుకోవడం ద్వారా ఆమె భారతీయ మూలాలను అద్భుతంగా ప్రతిబింబించారు. అంతకుముందు జరిగిన ప్రీ-మెట్ గాలా పార్టీలో కూడా భారత్‌లోని 26 రకాల విభిన్న ప్రాంతీయ హస్తకళల బోర్డర్లతో రూపొందించిన డ్రెస్‌ను ధరించి ఆమె అందరినీ ఆశ్చర్యపరిచారు. గత మూడేళ్లుగా రాహుల్ మిశ్రా, అనామికా ఖన్నా వంటి భారతీయ డిజైనర్ల దుస్తులనే ధరిస్తూ, ఇషా అంబానీ అంతర్జాతీయ వేదికపై భారతీయ ఫ్యాషన్‌కు బలమైన ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# నేను డబ్బు మనిషిని కాదు .. ఇష్టం లేని పని చేయను



తెలంగాణ పత్రిక మే 5

ఎల్బీ శ్రీరామ్ .. తెలుగు తెరపై రచయితగా .. నటుడిగా తనదైన హాస్యాన్ని పరిగెత్తించిన ప్రతిభాశాలి. ఆయన బాడీ లాంగ్వేజ్ ను .. డైలాగ్ డెలివరీని ప్రేక్షకులు ఇష్టపడుతూ ఉంటారు. 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఆయన తన కెరియర్ గురించిన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "రచయితగా ఉన్న నన్ను, నటుడిగా ఎక్కడికో తీసుకెళ్లి నిలబెట్టింది ఈవీవీ సత్యనారాయణ గారు. ఆయన చలవే ఇది" అన్నారు. "రచయితగా నా స్పీడ్ చూసి మా ఇంట్లో వాళ్లే చాలా కంగారు పడ్డారు. ముమ్మందు వచ్చే సినిమాలకు ఏం రాస్తాడు? అని మా పెద్దన్నయ్య వాళ్లు టెన్షన్ పడేవాళ్లు. నేను మాత్రం అదే తపనతో దూసుకుపోయేవాడిని. నటుడిగా 500 సినిమాలు చేసి ఉంటాను. ఆ తరువాత ఎక్కువగా తెరపై కనిపించడం లేదు. నటుడు తెరపై కనిపిస్తూ ఉంటేనే ఆడియన్స్ గుర్తుపెట్టుకుంటారు. ఎందుకు కనిపించడం కాలేదని ఆలోచన చేసేంత తీరిక ఎవరికీ ఉండక పోవచ్చు. అందుకే షార్ట్ ఫిలిమ్స్ చేసుకుంటున్నాను" అని అన్నారు. "దర్శకుడిగా .. నిర్మాతగా నాదైన దారిలో కష్టపడుతున్నాను. నటుడిగా ఒకే విధమైన పాత్రలు వస్తున్నాయి. రొటీన్ గా అలాంటి పాత్రలే చేయడం నాకు ఇష్టం లేదు. నాకు ఇష్టం లేని పని కోటి రూపాయలు ఇచ్చినా చేయను. డబ్బు కోసం మాత్రమే వేషాలు వేయడానికి నేను డబ్బు మనిషిని కాదు .. కళాకారుడిని. అన్నిరకాల పాత్రలు చేయాలని ఉంటుంది. అలాంటి పరిస్థితి లేకపోవడం వలన, నా మనసుకు నచ్చిన దారిలో వెళుతున్నాను" అని చెప్పారు.

# దాసరి నారాయణరావు గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైన మోహన్ బాబు



తెలంగాణ పత్రిక మే 5

తెలుగు సినీ పరిశ్రమ గర్వించదగ్గ దర్శకుడు దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ లో 'డైరెక్టర్స్ డే 2026' వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్షన్ కింగ్ మోహన్ బాబు తన గురువు దాసరిని గుర్తుచేసుకుంటూ ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. దర్శకుడు అనే పదానికి నిలువెత్తు అర్థం దాసరి గారేనని, తండ్రి లాంటి వ్యక్తిని కోల్పోయాననే బాధ తనలో ఎప్పటికీ ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో ఉన్న తనను ఇండస్ట్రీకి పరిచయం చేసి, 'మోహన్ బాబు' అని నామకరణం చేసి ఈ స్థాయికి తెచ్చింది ఆయనేనని కొనియాడారు. ఇదే క్రమంలో డైరెక్టర్ అసోసియేషన్‌కు తన వంతుగా రూ. 15 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. నటి జయసుధ మాట్లాడుతూ... ప్రపంచంలోని ఏ అవార్డు అయినా దాసరి గారి పేరిట ఇచ్చే అవార్డు కంటే గొప్పది కాదని పేర్కొన్నారు. ఎంతో మంది నటీనటులను స్టార్స్‌గా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ వేడుకలో బాబూమోహన్ తో పాటు పలువురు ప్రముఖులు కూడా పాల్గొని దాసరి గారితో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. పరిశ్రమలోని దర్శకులందరూ ఏకమై ఈ వేడుకను జరుపుకోవడం దాసరి గారికి ఇచ్చే నిజమైన నివాళి అని అతిథులు అభిప్రాయపడ్డారు.

# ఆస్తులు కూడబెడుతూపోతే చివరికి జరిగేది ఇదే



తెలంగాణ పత్రిక మే 5

తేజ .. తెలుగు తెరపై ప్రేమకథలను తనదైన స్టైల్లో పరిగెత్తించిన దర్శకుడు. ఒకానొక సమయంలో తేజ సినిమాలు యూత్ ను ఒక ఊపు ఊపేశాయి. ఎప్పటికప్పుడు కొత్తవాళ్లను పరిచయం చేస్తూ, ఆడియన్స్ ను మెప్పించిన వారాయన. తేజ చాలా ముక్కుసూటి మనిషి. తాను చెప్పదలచుకున్న విషయాన్ని కుండ బద్దలు కొట్టినట్టుగా మాట్లాడేస్తారు. ఆ మధ్య సుమన్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "నేను నా సినిమాల విషయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు చూసి, అలా చేయడానికి చాలా ధైర్యం కావాలని అనుకుంటారు. కానీ నిజానికి నేను అది తెలియక తీసుకున్న నిర్ణయమై ఉండొొచ్చు. సక్సెస్ సాధించడమంటే డబ్బు సంపాదించడం కాదు. మన ఫ్యామిలీకి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటూనే, మనకి నచ్చినట్టుగా మనం బ్రతకడం అనేది నా అభిప్రాయం. అలా ఉండటానికే నేను ప్రాధాన్యతనిస్తాను" అని అన్నారు. " చాలామంది తమ సంపాదనను పిల్లల కోసం దాచేస్తూ ఉంటారు. పిల్లలను ప్రయోజకులను చేయడానికి ట్రై చేయాలేగానీ, ఆస్తులను ఇచ్చి బద్ధకస్తులను చేయడం తప్పనేది నా ఉద్దేశం. తమ పిల్లలు పనికిరారు .. పైకి రారు అని భావించిన వాళ్లు మాత్రమే ఆస్తులను దాస్తున్నారు. తేనె టీగలు తేనె దాస్తూ వెళతాయి. ఫైనల్ గా మనం వెళ్లి మంటపెట్టి వాటిని తరిమేసి మనం తాగుతాం. ఆస్తులు దాస్తూ వెళ్లడం వలన జరిగేది ఇదే" అని చెప్పారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143